సూర్య
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం,11 మార్చి 2024

పార్లమెంటులో ఒక అసెంబ్లీ స్థానాన్ని బీజేపీకి కేటాయించాలి

కాకినాడ, మేజర్‌న్యూస్ : కాకినాడ పార్లమెంటు స్థానాల్లో ఒక అసెంబ్లీ స్థానాన్ని బిజెపికి పొత్తుల్లో కేటాయించాలని భారతీయ జనతా పార్టీ నాయకులు ఎనిమిరెడ్డి మాలకొండయ్య, చిట్నీడి శ్రీనివాస్, దువ్వూరి సుబ్రహ్మణ్యం కోరారు. ఈ మేరకు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకత్వానికి వినతిని పంపిస్తామని వారు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా అందునా కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గం భారతీయ జనతా పార్టీకి బలమైన స్థానమని, 1998లో ఎటువంటి పొత్తు లేకుండా కాకినాడ పార్లమెంటు స్థానం గెలవడం జరిగిందని వారు తెలిపారు. భారతీయ జనతా పార్టీ కేంద్ర నాయకత్వం, అదేవిధంగా రాష్ట్ర నాయకత్వం పొత్తులపై తీసుకున్న నిర్ణయం తమకు శిరోధార్యం అని, అయితే సీట్లు కేటాయింపు ఇంకా జరగనందన భారతీయ జనతా పార్టీకి కేటాయించిన స్థానంలో కాకినాడ పార్లమెంటులోని ఒక అసెంబ్లీ స్థానం ఉండాలని తాము కోరుకుంటున్నామని వారు తెలిపారు. కాకినాడ పార్లమెంటులో ఏ అసెంబ్లీ స్థానంలో ఏ భారతీయ జనతా పార్టీ నాయకునికి సీటు కేటాయించినా తమకు అభ్యంతరం లేదని, కేవలం కాకినాడ పార్లమెంట్లో ఒక స్థానాన్ని కోరడం అందు భారతీయ జనతా పార్టీని గెలిపించుకోవడం తమ ముఖ్య ఉద్దేశమని, తమ మనోభావాలను భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆమోదిస్తుందని ఆశాభావం తమకుందని ఎనిమిరెడ్డి, చిట్నీడి, దువ్వూరి తెలియజేశారు. రాష్ట్ర శాసనసభలో కాకినాడ జిల్లా నుంచి భారతీయ జనతా పార్టీ ప్రాతినిత్యం ఉండాలన్నదే తమ అభిమతం అని బిజెపి నాయకులు తెలియజేశారు.

అభివృద్ధికి చిరునామాగా కాకినాడ

- సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి

- రూ.9.40 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

- పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కౌడా చైర్పర్సన్ మాజీ మేయర్

కాకినాడ, మేజర్ న్యూస్ : గడచిన నాలుగున్నరేళ్ళలో కాకినాడ నగరాన్ని అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దగామని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. దాదాపు అన్ని డివిజన్లలో రహదారులు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాల్స్, వంటి అన్ని మౌలిక సదుపాయాలూ కల్పించామన్నారు. రూ.9.40 కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ద్వారంపూడి ఆదివారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. 9వ డివిజన్‌లో భగీరథ ఆలయం నుంచి మూడుగుళ్ల సెంటర్ వరకు సిసి రోడ్ల నిర్మాణం, 11 డివిజన్‌లో రజక కమ్యూనిటీ హాల్ కు శంకుస్థాపన,పదో డివిజన్ లో రహదారి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. 13వ డివిజన్‌లో హాబీబియా మసీద్ వద్ద కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు నిర్మాణానికి శంకుస్థాపన, 14వ డివిజన్ ఏటిమొగ తూర్పుపేటలో కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మాణానికి, 17వ డివిజన్‌లో నూతన సచివాలయ భవన నిర్మాణానికి, 23వ డివిజన్ ముగ్గుపేటలో స్మశాన వాటిక మరమ్మతు పనులను ప్రారంభించారు. 24వ డివిజన్ బాపూజీ నగర్, ముగ్గుపేట ప్రాంతాల్లో కమ్యూనిటీ హాల్స్ మరమ్మతు పనులను శంకుస్థాపన చేశారు. 39వ డివిజన్ లో కింతాడ వెంకటరావు కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన ప్రతి ఒక్క అభివృద్ధి కార్యక్రమాన్ని పూర్తి చేసామన్నారు. ప్రధానంగా సుమారు 30 వేల మంది ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. వీరందరికీ 2026 డిసెంబర్ నాటికల్లా గృహ నిర్మాణాలు కూడా పూర్తి చేసి సొంతింటి కల సహకారం చేస్తామన్నారు. మిగిలిన అభివృద్ధి కార్యక్రమాలను కూడా త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, వైఎస్ఆర్సిపి నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, స్మార్ట్ సిటీ ఎస్ఈ పి.వెంకటరావు, ఈఈ మాధవి, ఏఈ వై. నాగేశ్వరరావు, జేసిఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు రెహ్మాన్ ఖాన్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు భాష, నగర మైనార్టీ సెల్ అధ్యక్షుడు కాలిద్ బిన్ వలి, ఆయా డివిజన్లకు చెందిన మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కన్వీనర్లు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గ్రామాల పర్యటనలో జిల్లా ఎస్పీ

కాకినాడ,మేజర్‌న్యూస్ : రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా సున్నిత గ్రామాలుగా పరిగణిస్తున్న కరప మండల గ్రామాలలో జిల్లా ఎస్పీ ఆదివారం పర్యటించారు. గొర్రిపూడి, ఉప్పలంక గ్రామాలలో పర్యటించిన ఎస్పీ గ్రామ ప్రజలు, వివిధ పార్టీల ప్రజాప్రతి నిధులతో స్థానిక సచివాలయం, మర్రిచెట్టు ప్రాంతాలలో సమావేశమై స్థానిక సమస్యలను, శాంతి భద్రతల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గడచిన ఎన్నికలలో జరిగిన సంఘటనల దృష్ట్యా ఈరెండుగ్రామాల ప్రజలు రాబోవు ఎన్నికలలో బందోబస్తు విధులు నిర్వహించే కేంద్ర, రాష్ట్ర బలగాలకు శాంతి భద్రతల పరిరక్షణలో సహాయ సహకారాలు అందించి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా ఎన్నికల నిర్వహణ సజావుగా సాగేలా తోడ్పాటు అందించాలని జిల్లా ఎస్పీకోరారు. గొర్రిపూడి గ్రామంలో ఈ మధ్య కాలంలో రోడ్ ఏక్సిడెంట్లో గాయపడి చికిత్స పొంది కోలుకుంటున్న ఉబా కిషోర్ (వయసు 30 సం) ను స్వయంగా అతని ఇంటికి వెళ్లి ఎస్పీ పరామర్శించడం జరిగింది. స్థానిక చిన్నారులతో ఎస్పీ ముచ్చటించి భవిష్యత్తులో శ్రమతో అనుకున్న లక్ష్యాలను సాధించడానికి కృషి చేయాలని వారిలో స్ఫూర్తి నింపి మిఠాయిలు అందజేసారు.

గ్రామస్తులకు ఏ సమస్య ఉన్నా తనను నేరుగా వచ్చి సమస్య పరిష్కారం కోసం కలవాల్సిందిగా కోరారు. స్వయంగా జిల్లా ఎస్పీ తమ గ్రామాలకు వచ్చి ఆత్మీయంగా పలకరించి సమస్యలను అడిగి తెలుసుకోవడం ఆనందంగా వుందని గ్రామ ప్రజలు, ఇతర ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

ఈ గ్రామ పర్యటనలో స్థానిక కరప పోలీసు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

ఆత్రేయపురంలో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ : మహాత్మా గాంధీ జూనియర్ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆత్మీయ పలకరింపుల మధ్య ఆహ్లాదకరంగా జరిగింది. 1986-87 బ్యాచ్‌కి చెందిన 10వ తరగతి విద్యార్థులు అంతా వారి వారి వృత్తి వ్యాపారాలను పక్కనపెట్టి చిన్ననాడు విద్యాభ్యాసం చేసిన పాఠశాలలో గత స్మృతులు నెమరు వేసుకుంటూ గడిపారు. వారంతా మేము పెద్దలం అన్న సంగతి మరిచిపోయి విద్యార్థుల మాదిరిగా ఆటపాటలతోవారి జీవితంలో ఆటుపోట్లను, ఉన్నత స్థానాన్ని వివరిస్తూ విద్యాభ్యాసం నాటి సంగతులను ఆనందంగా జ్ఞాపకం చేసుకుంటూ గడిపారు. అలాగే తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

ఎమ్మెల్సీ కుడిపూడి వ్యాఖ్యలకు కాపునాడు ఖండన

అమలాపురం, మేజర్‌న్యూస్ : కాపు కార్పొరేషన్ ద్వారా 2000 కోట్లు కేవలం ముద్రగడ పద్మనాభం ద్వారానే వచ్చినట్లు, విద్యార్థిని విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు పొందుతూ దేశ విదేశాల్లో డాక్టర్లుగా, ఇంజనీర్లుగాతమ తల్లిదండ్రులకు లక్షలాది రూపాయలు సంపాదించి పెడుతున్నారని ఎమ్మెల్సీ కుడుపూడి అనడం చాలా బాధాకర మని కాపునాడు కార్యనిర్వహక అధ్యక్షులు అబ్బిరెడ్డి సురేష్ అన్నారు. మన చుట్టూతాపీ,వడ్రంగి తదితర రంగాల్లో కార్మికులుగా పనిచేస్తున్నారన్న విషయం మీకు తెలియనిదా అని కాపునాడు ప్రశ్నిస్తున్నదన్నారు. నాటి ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి కాపు సామాజిక వర్గానికి తగిన న్యాయం చేయటానికి కాపునాడు నాయకులు పిల్లా వెంకటేశ్వర రావు, పురంశెట్టి మంగారావు అప్పట్టి ఉపముఖ్యమంత్రి, హోంశాఖ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప, రామచంద్రపురం శాసనసభ్యులు తోట త్రిమూర్తులతో పాటు కాపు యువత ఎన్నో పోరాటాల చేసి సాధించుకున్న బి.సిఎఫ్.వంటి ప్రత్యేక జీవోల కృషిని ముద్రగడ ఖాతాకు జమ చేస్తూ శాసనమండలి సభ్యులు కుడుపూడి సూర్యనారాయణరావు ప్రచారం చేయడాన్ని కాపునాడు తీవ్రంగా ఖండిస్తుందని అబ్బిరెడ్డి అన్నారు. కాపు ఉద్యమం పట్ల అంత సానుభూతి వుంటే ముద్రగడతో కలిసి వైసిపి మానిఫెస్టోలో కాపు రిజర్వేషన్‌కు స్థానం కల్పించగలరా అని కాపు నేతలు సవాల్ విసిరారు. ఈ అత్యవసర సమావేశంలో ఉపాధ్యక్షులు గంగుమళ్ళ శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోటిపల్లి ధర్మారాజు, ముమ్మిడివరం, పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు నంద్యాల చంటి, తోట శ్రీనివాసరావు, మామిడికుదురు మండల అధ్యక్షులు గుండాబత్తుల తాతాజీ, అబ్బిరెడ్డి మూర్తి, కూనపనీడి ప్రసాద్ పాల్గొన్నారు.

ముమ్మిడివరం బీఎస్పీ అభ్యర్థిగా భీమారావు

అమలాపురం,మేజర్‌న్యూస్ : ముమ్మిడివరం నియోజకవర్గానికి బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా వాకపల్లి భీమారావును రాష్ట్రఅధ్యక్షులు బి.పరంజ్యోతి ఆదేశానుసారం నిర్ణయించినట్లు 3జిల్లాల ఇంచార్జి బత్తుల లక్ష్మణరావు పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఆదివానం అమలాపురంలోని బహుజన్ సమాజ్ పార్టీ పార్లమెంటరీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కుసుమ వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ప్రకటించినట్లు భీమరావు తెలిపారు.

విజయవంతమైన ఆరోగ్య శిబిరం

- ముఖ్యఅతిథిగా హాజరైన ఐటీడీఏపీఓ కావూరి చైతన్య

చింతూరు, మేజర్ న్యూస్ : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెడ్ యునైటెడ్ హాస్పిటల్స్, అమలాపురం, కోనసీమ జిల్లా వారి ఆధ్వర్యంలో ఆదివారం మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి చింతూరు ఐటీడీఏ పీవో కావూరు చైతన్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారు మూల ప్రాంతాలలో మెడ్ యునైటెడ్ హాస్పిటల్స్ వారు హెల్త్ క్యాంపు నిర్వహించడం అభినందించదగ్గ విషయమని, ఈ క్యాంపు కి వచ్చిన రోగులకు ఉచిత రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు, కంటి పరీక్షలు, ఈసిజి పరీక్షలు మరియు కావలసిన మందులు ఉచితంగా ఇవ్వడం మంచి పరిణామమని, అదేవిధంగా ముందు ముందు మీ యొక్క సేవలు మా ప్రాంతంలో విరివిగా నిర్వహించాలని కోరినారు. ఈ హెల్త్ క్యాంపులో మెడ్ యునైటెడ్ హాస్పిటల్స్‌తో పాటుగా కాంటినేన్టల్ హాస్పిటల్, టెక్ సోఫీ, ట్రోవిటి, మరియు గాయత్రి లాబ్స్ నుండి నిపుణులైన వైద్యులు పాల్గొనడం విశేషం. ఈ క్యాంపు నుద్దేశించి టెక్ సోఫి కంపెనీ ముఖ్య కార్యనిర్వహణాధికారి కళ్యాణ్ వర్మ మాట్లాడుతూ ఈ హెల్త్ క్యాంప్ లో 500 మంది చికిత్సలు పొందారని తెలిపారు. కాంటినెంటల్ హాస్పిటల్ మెడికల్ అంకాలజిస్ట్ డా. సురేష్ ఈ క్యాంపుకు వచ్చిన రోగులకు ఆరోగ్య అవగాహనా కార్యక్రమం నిరహించినారు. ప్రజలను సంప్రదించి ఇక్కడ పరిస్థితులను, అనారోగ్య సమస్యల గురించి చర్చించడం జరిగింది.ఈ క్యాంప్‌లో డా. ఉదయ్ కుమార్ రెడ్డి, మెడికల్ ఆఫిసర్ పిహెచ్‌సి-తులసిపాక డా. జగదీష్, డా.దివ్య, క్యాంపు మేనేజర్ సురేష్, కళ్యాణ్, కృష్ణ, సాయి, పిహెచ్‌సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టీడీఆర్ బాండ్ల ద్వారా సుమారు 500 కోట్ల దోపిడీ

- విజిలెన్స్ విచారణ పట్ల బీజేపీ నేతల హర్షం

కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడలోని ప్రైవేట్ వ్యక్తుల దగ్గర కార్పొరేషన్ డీటీఆర్ బాండ్ల జారీ ద్వారా కొనుగోలు చేసిన భూమి విషయంపై అక్రమాలు జరిగాయని ఇది నిబంధనలకు విరుద్ధమంటూ విజిలెన్స్ శాఖకు విచారణ నిమిత్తం ఫిర్యాదు చేశామని బీజేపీ నేతలు తెలియజేశారు. నిబంధనలకు విరుద్ధంగా టీడీఆర్ బాండ్లను జారీ చేసిన అధికారులు దాని వెనకున్న వారిపైన చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ నేతలు ఆదివారం కాకినాడ రామారావుపేటలో ఉన్న బీజేపీ కార్యాలయంలో విలేకరులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కాకినాడ నగర అధ్యక్షులు గట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కాకినాడ దుమ్ములపేటలో ఐదు ఎకరాలు విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణంకు, మరో ఐదు ఎకరాలు చెత్త డంపింగ్ యార్డ్ కొరకు సుమారు 40 కోట్ల విలువైన ప్రైవేట్ భూమిని సుమారు 500 కోట్లకు టీడీఆర్ బాండ్లు జారీ చేయడం నిబంధనలకు విరుద్ధమన్నారు. ప్రభుత్వ భూమి ఉండగా ప్రైవేటు వ్యక్తుల వద్ద ఈ భూమి కొనుగోలు చేసి 500 కోట్లు దోపిడీకి పథకం వేసినవారిపై చర్యలు తీసుకోవాలని తాము జిల్లా కలెక్టర్, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసినా కలెక్టర్ ఏమి పట్టించుకోలేదన్నారు. విజిలెన్స్ అధికారులు మాత్రం స్పందించి దీనిపై విచారణ చేస్తున్నామని తమకు తెలియపరచారన్నారు. బీజేపీ నాయకులు దువ్వూరి సుబ్రమణ్యం, ముత్తా నవీన్, యెనిమిరెడ్డి మాలకొండయ్యలు మాట్లాడుతూ టీడీఆర్ బాండ్లు జారీ చేయడం నిబంధనలకు విరుద్ధమని, ప్రైవేటు వ్యక్తుల వద్ద భూములు కొని వినియోగంలోకి తీసుకురావడం తగదన్నారు. గతంలో 9 కోట్ల రూపాయలతో వినాయక సాగర్ వద్ద నిర్మాణం చేపట్టి నిధులను దుర్వినియోగం చేశారని అందుకు బాధ్యులైనవారిపై చర్యలు తీసుకోవాలని, అక్కడ మాత్రం ప్రభుత్వ స్థలంలోనే విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. బీజేపీ- టీడీపీ- జనసేన పొత్తును తాము స్వాగతిస్తున్నామని, కాకినాడ ఎంపీ, సిటీ అసెంబ్లీ నియోజకవర్గంలను బీజేపీకే కేటాయించాలని కోరుతున్నామన్నారు. అలా కాని పక్షంలో పార్టీ నిర్ణయానికి కట్టుబడతామని వారు చెప్పారు.ఈ సమావేశంలో బీజేపీ నాయకులు మాజీ కార్పొరేటర్ సాలగ్రామ లక్ష్మీప్రసన్న, నాయకులు చిట్నీడి శ్రీనివాస్, కెంగం హరి, దొడ్డి వీరేంద్ర, చక్కా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక డిఎస్సీ ప్రకటించాలి

- మన్యం బంద్‌కు సిపిఎం మద్దతు

రంపచోడవరం, మేజర్ న్యూస్ : రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 10వ తేదీన ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక డిఎస్సీ ప్రకటించాలని, అలాగే జీవో నెంబర్ 3 పునరుద్ధరించాలని చేపట్టిన బంద్‌కు సిపిఎం పార్టీ పూర్తి మద్దతు ఇచ్చింది. ఏజెన్సీ ప్రధాన కేంద్రమైన రంపచోడవరంలో ఆదివారం బంద్ ప్రశాంతంగా నిర్వహించారు. మార్చి 10వ తేదీన ఏజెన్సీలో ప్రత్యేక డిఎస్సీ ప్రకటించాలని జీవో నెంబర్ 3 పునరుద్ధరణ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అడ్మిన్స్ తీసుకురావాలని, ఇలా పలు డిమాండ్ల సాధన కోసం నిర్వహించిన ఏజెన్సీ బంద్ కు సిపిఎం పార్టీ పూర్తి మద్దతు ఇచ్చింది. రంపచోడవరంలో చాలా వరకు దుకాణాలు మూతపడ్డాయి. ఆదివారం వారపు సంత కావడంతో వ్యాపారులు, ప్రజలు కొంత ఇబ్బందికి గురయ్యారు. ఈ బందుకు సంఘీభావంగా మార్చి 8, 9 తేదీలలో రాష్ట్రంలోని గిరిజన జిల్లాలలో ఆదివాసీ జన రక్షణ దీక్షలు సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర విభజన అనంతరం ఆదివాసీ ప్రాంతాల్లో నిరుద్యోగుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంది కానీ ఉద్యోగాలు మాత్రం లేవని, రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు స్పెషల్ డిఎస్సీ నిర్వహించలేదని, సుప్రీంకోర్టులో జీవో నెంబర్ 3 ని కొట్టివేసిన తర్వాత దాన్ని వెకెట్ చేయించడానికి ఇప్పటివరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి ప్రయత్నం చేయలేదని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు నష్టాన్ని కలిగిస్తున్నాయని సిపిఎం నాయకులు ఆరోపించారు. అటవీ సంరక్షణ చట్టం సవరణ చేసి భూములు లేకుండా పోడు భూములకు పట్టాలు ఇవ్వలేదని పైగా ఉన్న భూములు లాగేసుకుంటున్నారని, ఆదివాసీలపై విపరీతమైన దాడులు జరుగుతున్నాయని, ఆస్తులకు, మానప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని, ఈ విషయంలో విఫలమైన ప్రభుత్వాలకు రానున్న ఎన్నికలలో ప్రజలు గోరి కడతారన్నారు. ఒకపక్క కేంద్ర ప్రభుత్వం ఏజెన్సీలోని భూములను ఐడియల్ ప్రాజెక్టు పేర్లతో భూములను ఆదానీకి ఇచ్చేస్తున్నారని, గ్రామాలలో గ్రామసభలు గాని పంచాయతీ అనుమతులు గాని లేకుండా ఏజెన్సీ భూములను ఇలా కార్పొరేట్ సంస్థలకు ధారాధత్వం చేస్తున్నారని, రాజ్యాంగంలో షెడ్యూల్ 5 కింద ఉన్న హక్కులను పూర్తిగా హరించేస్తున్నారని, ఇటువంటి బిజెపి ప్రభుత్వానికి దానికి మద్దతు తెలుపుతున్న వైసిపి, టిడిపి, జనసేన పార్టీలను రానున్న ఎన్నికల్లో ఓడించాలని సిపిఎం పార్టీ ప్రజలకు విజ్ఞప్తి చేస్తుందన్నారు. రానున్న ఎన్నికలలో సిపిఎం పార్టీ రంపచోడవరం నియోజకవర్గం నుండి పోటీ చేస్తుందని అభ్యర్థిని త్వరలో ప్రకటిస్తామన్నారు. పోలవరం ప్రాజెక్ట్ కోసం తన సర్వస్వాన్ని అర్పించిన నిర్వాసితులకు చెల్లించాల్సిన ప్యాకేజీని చెల్లించకుండా వారిని నడి గోదారిలో ముంచారని, కాంటూరు పేరుతో కాకి లెక్కలు చెప్పి రెండు పర్యాయాలు వరదల్లో మునిగిపోయిన వారికి కనీసం నష్టపరిహారం ఇవ్వలేదని సుమారు పోలవరం ప్రాజెక్టు వల్ల లక్ష ఆరువేల కుటుంబాలు నిరాశ్రయులైతే, కేవలం 22 వేల కుటుంబాలకు మాత్రమే నామమాత్రంగా లక్ష లక్షన్నర రూపాయలు ప్యాకేజీలు ఇచ్చి చేతులు దులిపేసుకున్నారని, ఇలా గిరిజనులను మోసం చేసిన బిజెపికి దానికి మద్దతు తెలుపుతున్న టిడిపి, వైసిపి లకు ప్రజలను ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. మన్యం బంద్ సందర్భంగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఫొటోగ్రాఫర్‌ను చంపిన కిరాతకులను కఠినంగా శిక్షించాలి

అమలాపురం, మేజర్ న్యూస్ : విశాఖ జిల్లా మధురవాడ గ్రామానికి చెందిన సాయి అనే ఫోటోగ్రాఫర్‌ను ప్రోగ్రాం పేరుతో తీసుకువెళ్లి అతి కిరాతకంగా చంపిన హంతకులను కఠినంగా శిక్షించాలని అమలాపురం మండలం ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, ఫోటోగ్రాఫర్లకు భద్రత కలిగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. విలువైన కెమెరాలను అపహరించి అతి కిరాతకంగా చంపిన అంతకులను కఠినంగా శిక్షించి ఫోటోగ్రాఫర్లకు భద్రత కలిగించాలని అమలాపురం పట్టణ గడియార స్థంభం సెంటర్‌లో ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కాజబాబు, ప్రెసిడెంట్ నగేష్, సెక్రటరీ తాతాజీ, ట్రెజరర్ నాగేంద్ర, వైస్ ప్రెసిడెంట్ పొట్టుపోతు నాగు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రమణ, ప్రసాద్, ఉషాకిరణ్, రాజుపాల్గొన్నారు.

వెంకన్న ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న అన్నదాన భవన నిర్మాణానికి గోశాలకు అర్తమురు గ్రామానికి చెందిన కర్రి సుబ్బాయమ్మ రూ.లక్ష విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆలయం మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిరణ్ కుమార్, కమిటీ సభ్యులు, సిబ్బంది స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి

- బొబ్బర్లంక వెలిచేరు నుండి టిడిపిలోకి చేరికలు

ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ : రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కార్యకర్తలు, నాయకులు కృషిచేయాలని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు, జనసేన టిడిపి ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు పిలుపు నిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని ఆదివారం బొబ్బర్లంక, వెలిచేరు గ్రామాల నుండి పలువురు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ, దళిత వర్గాల అభ్యున్నతి కోసం టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని, సంక్షేమ అభివృద్ధి పథకాలను అమలు చేసే చంద్రబాబుకే తిరిగి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకట్రావు, ముళ్ళపూడి భాస్కరరావు, కరుటూరి నరసింహారావు, జల్లి కామేశ్వరరావు, నరాలశెట్టి వెంకన్న, సల్లపూడి నాగేశ్వరరావు మరియు బొబ్బర్లంక వెలిచేరు గ్రామ తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్, స్పందన

కాకినాడ, మేజర్ న్యూస్ : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ జె. వెంకటరావు చెప్పారు. నగర ప్రజలు స్థానికంగా ఎదుర్కొనే సమస్యలు, ఇబ్బందులను కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నెంబర్ 0884 2357800 కు కాల్ చేసి తెలియజేయవచ్చు నన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. అలాగే 10:30 నుంచి స్పందన కార్యక్రమం యధావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకూ రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా సమస్యలు తెలియజేయవచ్చునని కమిషనర్ సూచించారు.

బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దాం

- మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల

అమలాపురం,మేజర్న్యూస్ : తెలుగుదేశం, బిజెపి, జనసేన కలయికను స్వాగతిద్దాం... కలసి పనిచేసి, భావితరాల బంగారు భవిష్యత్‌కు బాటలు వేద్దాం అని మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్ పిలుపు నిచ్చారు. మూడు పార్టీల కలయికపై ఆయా పార్టీ నాయకులు ఆదివారం ఆయనను కలసిన సందర్భంగా ఈ పిలుపునిచ్చారు. అందరం నిబద్ధతతో పనిచేసి జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి పంపేద్దాం అని ఆయన అన్నారు.అమలాపురం పార్లమెంట్ పరిధిలో అన్ని నియోజకవర్గాల్లో భారీమెజార్టీతో గెలుపొందేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గణేష్ అన్నారు.

ఓఎన్‌జిసిపై ఉమ్మడి ఉద్యమ కార్యాచరణ

- అఖిలపక్షం తరపున ఐక్య పోరాటానికి సిద్ధం
- స్పష్టం చేసిన రాజకీయ పార్టీల ప్రతినిధులు
- ఎమ్మెల్యే ద్వారంపూడి సహా నేతల సంఘీభావం

కాకినాడ, మేజర్ న్యూస్ : కేజీ బేసిన్‌లో ఆయిల్ నిక్షేపాల అన్వేషణ కారణంగా నష్టపోతున్న మత్స్యకారులకు నష్టపరిహారం అందించే విషయంలో రాజకీయాలకు అతీతంగా ఉమ్మడి ఉద్యమ కార్యాచరణకు సమయత్వం కావాలని అఖిలపక్ష నేతలు పిలుపునిచ్చారు. చమురు సంస్థల నిర్వాకాల వల్ల నష్టపోతున్న మత్స్యకారులందరికీ న్యాయం జరగాలన్న ఒకే ఒక్క ఎజెండాతో ముందుకు సాగాలని నిర్ణయించారు. స్థానిక లంగరు రేవువద్ద ఓఎన్‌జిసికి వ్యతిరేకంగా మత్స్యకారులు చేస్తున్న నిరసన శిబిరాన్ని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డితోపాటు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు ఆదివారం సందర్శించి సంఘీభావం ప్రకటించారు. తొలుత సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు మాట్లాడుతూ మత్స్యకారులకు న్యాయం చేసే విషయంలో ఓఎన్జిసి సంస్థ మీనమేషాలు లెక్కించకుండా వెంటనే పరిహారంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే కేజీ బేసిన్‌లో వెలికితీసిన నిక్షేపాల్లో రాష్ట్ర వాటా కోసం అసెంబ్లీ వేదికగా గట్టిగా డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. జిల్లా కలెక్టర్, మత్స్యకార ప్రతినిధులు ఓ.ఎన్.జి.సి. అధికారులతో సోమవారం జరిగే సమావేశంలో స్పష్టమైన సమాధానం రాకపోతే భవిష్యత్ కార్యాచరణను ఆ వెంటనే ప్రకటిస్తామని స్పష్టం చేశారు.కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే సిసిమిక్ సర్వే ను నిలుపుదల చేశామని, ఓఎన్‌జిసి దిగి రాకపోతే సముద్రంలోకి వెళ్లి మరీ కార్యకలాపాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. జిల్లాస్థాయిలో కలెక్టర్ సమక్షంలో జరిగే చర్చలు ఫలప్రదం కాగలవని ఆశిస్తున్నామని, అలా కాని పక్షంలో సీఎంఓ స్థాయిలో కూడా సమావేశం ఏర్పాటు చేసి మత్స్యకారులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా కలసి వచ్చే ప్రతి ఒక్కరిని ఉద్యమంలో భాగస్వాములను చేసి మత్స్యకారులకు న్యాయం జరిగేందుకు శ్రమిస్తామని స్పష్టం చేశారు. కేజీ బేసిన్ నుంచి లక్షల కోట్ల సంపద తరలించుకు వెళుతున్న సంస్థలు సముద్ర వేటనే జీవనాధారంగా చేసుకున్న మత్స్యకారులకు న్యాయం చేసే విషయంలో ఎందుకు వెనకడుగు వేస్తున్నాయని ప్రశ్నించారు. ఉప్పాడ నుంచి ఉప్పలంక వరకు దాదాపు 40 వేల మత్స్యకార కుటుంబాలు నిక్షేపాల వెలికితీత వల్ల నష్టపోతాయని ప్రాథమికంగా అంచనా వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, తాటిపాక మధు,కే.బోడకొండ,తోకలప్రసాద్(సిపిఐ),కాటాడి జానకిరామ్, చక్రవర్తి (వైయస్సార్సీపి),నరాల శివ, జాషువా (అమ్ ఆద్మీ పార్టీ), పిట్టా వరప్రసాద్, సంపత్ కుమార్ (రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా), చెక్కా నూకరాజు, కుక్కలపోతురాజు (కాంగ్రెస్), పి.సత్యనారాయణ (బహుజన్ సమాజ్ పార్టీ) తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో చేరికలు

కాకినాడ, మేజర్ న్యూస్ : స్థానిక వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం నందు, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు, కాకినాడ రూరల్ శాసనసభ్యులు కురసాల కన్నబాబు చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఆకర్షితులై, కాకినాడ రూరల్ శాసనసభ్యులు, వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు సమక్షంలో, కాకినాడ స్మార్ట్ సిటీ వైఎస్సార్సీపీ జనరల్ సెక్రటరీ మాదబోయిన నేరెళ్లు ఆధ్వర్యంలో కాకినాడ అర్బన్ మండలం, 2వ డివిజన్, కొండేలుపేటకు చెందిన తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు కురదాసు భగీరథ, కొండేలు బంగారయ్య, మధు, కొండేలు సింహాద్రి మత్స్యకార సామాజికవర్గ నాయకులు, యువత సుమారు 50 మంది వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీలో చేరారు.

అయోధ్యలో ఘనంగా సహస్ర కలశాభిషేకం

కాకినాడ, మేజర్ న్యూస్ : అయోధ్యలో శ్రీ బాలరామ ప్రతిష్ట సందర్భంగా శ్రీ పేజవరా మఠాధితులు విశ్వప్రసన్న తీర్థ ఉడిపి స్వామీజీ ఆధ్వర్యంలో ఆదివారం అయోధ్యలో 1008 కలశ సహిత బ్రహ్మ కలశాభిషేకము బాలరామ విగ్రహానికి ఘనంగా నిర్వహించారు. ఎనిమిది రోజులుగా మండల దీక్ష కార్యక్రమాన్ని శ్రీ రామదేవుని గురించి స్వామీజీ చేపట్టారని మాధ్వ పురోహితులు యాతగిరి మద్వేష్ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ యాత గిరి పరశురామ్ సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. తత్వవాద మాధ్వ మాసపత్రిక ప్రధాన సంపాదకులు నాగేంద్ర చార్ అందించిన సమాచారాన్ని పత్రికలకు విడుదల చేశారు.ఈకలిసాభిషేకాలు చారిత్రక ఉత్సవంగా వారు ప్రస్తావించారు. ఈ సందర్భంగా లక్షలాది పుష్పాలతోఅయోధ్య రామ మందిరాన్ని ఏకంగా అలంకరించబడిందని వివరించారు. ఉత్తరాది మఠాధిపతులు శ్రీ సత్యాత్మతీర్థ స్వామీజీ ఈ విశేష అభిషేకాల నిర్వహించడం పట్ల ప్రత్యేకంగా స్వామీజీకి అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ కలప అడితిలో 7వ రోజుకు చేరిన నిరాహార దీక్ష

చింతూరు, మేజర్ న్యూస్ : చింతూరు మండలం ఎర్రంపేటలోని ప్రభుత్వ కలప అడితి ఎదురుగా లారీ ఓనర్స్ అసోసియేషన్ నిరాహార దీక్షలు 7వ రోజుకు చేరుకున్నాయి. కలప డిపోలో ఏజెంట్లుగా పనిచేస్తున్న అజయ్ కుమార్, రామకృష్ణ, వరప్రసాద్‌లు,అటవీ సిబ్బంది డిఆర్ఓ,రేంజర్ అక్రమాలకు పాల్పడుతున్నారని, తమ లారీలకు పని కల్పించడం లేదని, కలప,వెదురు పంపిణీలో అవకతవకలకు పాల్పడుతున్నారని, అటవీ శాఖ ఉన్నతాధికారులు (సిసిఎఫ్, పిసిసిఎఫ్) వారిపై చర్య తీసుకోవాలని కోరుతూ లారీ యూనియన్ అసోసియేషన్ చేస్తున్న నిరాహార దీక్ష 7వ రోజుకు చేరింది. ఈ కార్యక్రమంలో లారీ ఓనర్లు, కోట్ల సూర్య ప్రకాష్, నక్క శ్రీను, వెంకట్‌రామ్‌రెడ్డి, కే.మహాలింగం, వెంకటేష్, యస్.నారాయణ, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

సైనికుడిలా పనిచేస్తా

- ఈ నెల 14న వైసీపీ పార్టీలోకి ముద్రగడ పద్మనాభం
- సీఎం జగన్ తరపున ఎన్నికలలో ప్రచారం
- తాను ఎటువంటి పదవి కాంక్ష కోరుకోవడం లేదన్న ముద్రగడ
- పార్టీ అధికారంలోకి వస్తే ఏ పదవి ఇచ్చినా స్వీకరిస్తానని వెల్లడి

కాకినాడ, మేజర్ న్యూస్ : ఈనెల 14వ తేదీన వైసీపీ పార్టీలోకి సీఎం జగన్ సమక్షంలో చేరనున్నట్లు కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం తెలిపారు. ఆది వారం ఉదయం కిర్లంపూడి మండలంలోని ఆయన నివాసంలో ముద్రగడ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14వ తేదీన తాను, తన కుమారుడు, తన అనుచరులతో తాడేపల్లి వెళ్లి సాయంత్రం 6 గంటల ప్రాంతంలో పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు. సీఎం జగన్ తరఫున ఎన్నికలలో ప్రచారం నిర్వహిస్తానన్నారు. సైనికుడిలా పార్టీ కోసం కష్టపడి పనిచేస్తానన్నారు. తాను ఎటువంటి పదవి కాంక్ష కోరుకోవడం లేదన్నారు. కేవలం పార్టీ తరఫున ప్రచారం చేయడానికి మాత్రమే వెళుతున్నాను అన్నారు. రేపు పార్టీ అధికారంలోకి వస్తే వాళ్లు ఏ పదవి ఇచ్చినా స్వీకరిస్తానని ముద్రగడ పద్మనాభం తెలిపారు.

ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకి పోషకాహార కిట్స్ అందజేత

కాకినాడ, మేజర్ న్యూస్ : నేతి లక్ష్మణ శేషారత్నం దంపతులు రోటరీ చేయూత భవన్ నందు ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకి ప్రతినెలా అందిస్తున్నట్లుగానే చేయూత – ఆత్మీయ స్పర్శ కార్యక్రమం ద్వారా ఈ నెల కూడా పోషకాహార కిట్స్ ను అందించడం జరిగింది. అదేవిధంగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన చిన్నారులకు రుచికరమైన భోజనాలు ఏర్పాటు చేయడం జరగింది. సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రవికుమార్, అలీమ్ లు మాట్లాడుతూ సమాజంలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఇటువంటి చిన్నారులను మనసున్న ప్రతి ఒక్కరూ అక్కున చేర్చుకొని ఆదుకున్నప్పుడే వారికి మనమున్నామనే భరోసా అందించినట్లు అవుతుందని తెలిపారు. ఇలా సహాయం అందించడంలో ముందు వరుసలో వుండే మొబైల్ వరల్డ్ బాబు ఆదివారం తన సతీమణి ఉషారాణి పుట్టినరోజు సంధర్భంగా చేయూత సంస్థ కి విచ్చేసి వినికిడి లోపంతో బాధపడుతున్న ఒక మహిళకు చెవిటి మిషన్ అందించడమే కాకుండా పోషకాహార కిట్స్ కూడా అందించారు. లయన్స్ క్లబ్ సుజాత తన కుమారుడు సుకుమార్ జన్మదినం సందర్భంగా కార్యక్రమానికి భోజనాలు నిమిత్తం విరాళం అందించినందుకు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు కృతజ్ఞతలు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు బాషా, నారాయణమూర్తి, పవన్, శివ, కర్రి వీర శివ, విజయ్, సుబ్బారావు, ఝాన్సి, మాలతి, వాసవి, లయన్స్ క్లబ్ సభ్యులు దేవి, శ్రీనివాస్, రాజు అత్యధిక సంఖ్యలో చేయూత సభ్యులు, చిన్నారులు పాల్గొన్నారు.

మన్యం బంద్ విజయవంతం

చింతూరు,మేజర్న్యూస్ : ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసులకు ఆదివాసి నిరుద్యోగులకు తీవ్ర నష్టం పరిచే ప్రభుత్వ విధానాలపై ఆదివాసులు ఐక్య పోరాటాలకు సిద్ధమై జీవో నెంబర్‌ను అడుగు చట్టబద్ధత కల్పించే అంతవరకు ఏజెన్సీ ఆదివాసీ నిరుద్యోగుల 100% ఉద్యోగాలు కల్పించేటంతవరకు పోరాటానికి సిద్ధం కావాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి, పులి సంతోష్, సిపిఎం జిల్లా నాయకులు సిసం సురేష్,పల్లపు వెంకట్ మడివి రాజు బంద్‌లో పాల్గొన్న ప్రజానీకాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ డిమాండ్ చేశారు.ఆదివారం నాడు మార్చి 10 మన్యం బంద్ ఏజెన్సీ ఆదివాసి నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని మన్యం రాష్ట్ర బంద్ పిలుపులో భాగంగా మండల వ్యాప్తంగా చింతూరు సెంటర్ వద్ద ఉన్న వ్యాపార దుకాణాలు ప్రయాణ వాహనాలు, పెట్రోల్ బంకులు, హోటల్స్ బంద్ నిర్వహించారు. బంద్ సందర్భంగా చింతూరు సెంటర్ వద్ద గిరిజన సంఘం నాయకులు, ఆదివాసి ఉద్యోగులు ఆదివాసి జనసేన తెలుగుదేశం ఆదివాసి నాయకులు ఏజెన్సీ మన్యం బందుకు మద్దతుగా చింతూరు నందు గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ప్రదర్శన నిర్వహించారు, ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్, సిపిఎం జిల్లా నాయకులు, సిసం సురేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని, 100% ఉద్యోగాలు కల్పించే జీవో నెంబర్ మూడుకు చట్టబద్ధత కల్పించాలని, 1/70, ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసి సంపూర్ణ అభివృద్ధి సాధించడానికి రాజ్యాంగబద్ధంగా ఉన్న హక్కులపై ప్రభుత్వాలు సుప్రీంకోర్టు ద్వారా దాడి చేస్తున్నాయని, అధికారంలోకి రావడం కోసం వైసిపి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతి ఏడాది డీఎస్సీ ప్రకటించి ఇస్తానని, ఈనాడు దగా డిఎస్సీతో ఆదివాసి ప్రాంతాలలో ఉద్యోగాలు కల్పించాల్సినటువంటి ప్రభుత్వం ఆదివాసీలను దగా చేసి కేవలం 38 పోస్టులతో డీఎస్సీ ప్రకటించడం అన్యాయం అని, 100% ఉద్యోగాలు కల్పించే జీవో నెంబర్ 3 చట్టబద్ధత కల్పించడమే ఆదివాసీలకు సామాజిక న్యాయం జరిపించడం అని అన్నారు. చట్టాలు పటిష్టంగా అమలు కోసం ఆదివాసీలందరూ కదిలి రావాలని, ఐక్య ఉద్యమాల ద్వారానే ప్రభుత్వాలు దిగిరాక తప్పదని ఈ సందర్భంగా పిలుపునివ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో తుమ్మల ఎంపిటిసి రేఖ రాజ్ కుమార్, గిరిజన సంఘం నాయకులు దిలీప్, ముట్టం రాజయ్య, లెనిన్, శీలం తమ్మయ్య, పాండు నాగార్జున, కారం సుబ్బారావు, సాయి, కూర భీమయ్య, జనసేన మండల అధ్యక్షులు మడివి రాజు, తీగల రవి తదితరులు పాల్గొన్నారు.

2024 ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీల కలయిక చారిత్రాత్మకం

- రాష్ట్రంలో నెలకొన్న క్లిష్టపరిస్థితుల ఆధారంగా అధినేత చంద్రబాబు పొత్తు నిర్ణయం తీసుకున్నారు
- తెలుగుదేశం, జనసేన, బీజేపీల కూటమిని పార్టీ సభ్యులుగా మేము అందరం స్వాగతిస్తున్నాం
- వైసీపీ నిరంకుశ పాలనను తుదముట్టించేందుకు బిజెపి-టిడిపి-జనసేన కలిసి పోటీ చేయనున్నాయి

కాకినాడ,మేజర్న్యూస్ : 2024 ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీల కలయిక చారిత్రాత్మకమని టిడిపి కాకినాడ పార్లమెంట్ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ వ్యాఖ్యానించారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీల కూటమిని పార్టీ సభ్యులుగా తామంతా స్వాగతిస్తున్నామన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలనపై నిప్పులు చెరిగారు. జగన్ రెడ్డి పాలనలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడిందన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్‌ను జగన్‌రెడ్డి ప్రభుత్వం అప్పులాంధ్ర ప్రదేశ్ గా మార్చిందంటూ మండిపడ్డారు. కులంతో సంబంధం లేకుండా బీసీలు, ఎస్సీ, ఎస్టీలపై దాడులు జగన్ రెడ్డి ప్రభుత్వంలో జరిగాయన్నారు. వైసీపీ పాలనలో ప్రభుత్వం అంటే కేవలం జగన్ రెడ్డి, విజయసాయి రెడ్డి, సజ్జల రామకృష్ణరెడ్డి, ధనుంజయ్ రెడ్డిగా మారిందంటూ విమర్శించారు. ఈ జగన్ ప్రభుత్వంలో బీసీలను ఎంత హీనంగా చూశారో వైకాపా బీసీ సెల్ అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి మాటల్లోనే విన్నాం అని గుర్తు చేశారు. బీసీలకు తెలుగుదేశం పార్టీ పుట్టినిల్లు లాంటిందన్నారు నవీన్. మొన్న జరిగిన జయహో బీసీ కార్యక్రమం ద్వారా మరోసారి రుజువైందన్నారు. అరాచక జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని గద్దెదింపేందుకు మూడు పార్టీలు కలిసి వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనున్నాయని జ్యోతుల నవీన్ కుమార్ స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీపై కేంద్రంలో ఉన్న బీజేపీ పెద్దలకు కూడా నమ్మకం కలిగింది. అందుకే కేంద్రమే పొత్తులకు ఆహ్వానించిందని తెలిపారు. తెలుగు ప్రజల కోసం, ఆంధ్రప్రదేశ్ అభ్యున్నతి కోసం తెలుగుదేశం పార్టీ సంకల్పించిన మహాయజ్ఞానికి ఇటు జనసేనతోపాటు, బీజేపీ కూడా కలిసి వస్తోందన్నారు. నారా చంద్రబాబు నాయుడు దార్శనిక పాలన ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రక్షగా ఉంటుందని మేము నమ్మాము, అతిపెద్ద జాతీయ పార్టీతోపాటు దేశం మొత్తం మాకు మద్దతిస్తోందని టిడిపి కాకినాడ పార్లమెంట్ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ వ్యాఖ్యానించారు.

శ్రీ సత్యదేవని నిత్య అన్నదానానికి పలువురు భక్తులు రూ.2,11,000/- విరాళాలు

అన్నవరం,మేజర్న్యూస్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగానిర్వహిస్తున్ననిత్య అన్నదాన మునకు పలువురు భక్తులు ఆదివారం నాడు విరాళాలు సమర్పించారు. విశాఖపట్నంనకు చెందిన ఉప్పలపాటి నరేంద్రనాథ్ జనవరి 4వ తేదీనాడు వీరవెంకట శివసాయి పేరు మీద అన్నదానం జరిపించాలని రూ.1,11,116లు అందజేశారు. తుని పట్టణానికి చెందిన మరో దాత పులవర్తి వెంకట జగన్నాథ గుప్త, తమ వ్యాపార సంస్థ శ్రీ లక్ష్మీ గణపతి జ్యువెలర్స్ పేరు మీద అన్నదానం జరగాలని రూ.1,00,100లు విరాళం దేవస్థానం పిఆర్‌వో దామెర్ల కృష్ణారావుకు, ట్రస్ట్ బోర్డ్ మెంబర్ దోమాడ సుందర్రావుకు అందజేశారు. దాతలకు దేవస్థానం అధికారులు దర్శనం చేయించి శ్రీ స్వామివారి ప్రసాదం అందజేశారు.

పేదల సమస్యలపై నిరంతర పోరాటమే పట్రా ముత్యంకి నిజమైన నివాళి

చింతూరు,మేజర్న్యూస్: ప్రజా సమస్యలపై ప్రజలను కదిలించడం, గ్రామాలలో సిపిఎం పార్టీ నిర్మాణం చేపట్టడం అమరజీవి పట్రా ముత్యం కు నిజమైన నివాళి అని అమరజీవి పట్రా ముత్యం 10వ వర్ధంతిలో సిపిఎం జిల్లా నాయకులు, సిసం సురేష్, పల్లపు వెంకట్, పిలుపునిచ్చారు. ఆదివారం తుమ్మల గ్రామం పట్రా ముత్యం గారి ఉన్న స్థూపం వద్ద చిత్రపటానికి పూలమాల వేసి నివాళి కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమానికి ముత్యం కుటుంబ సభ్యులు, గ్రామ పంచాయతీ స్థాయి శాఖ సభ్యులు, మండల కమిటీ సభ్యులు పాల్గొనడం జరిగినది. ఈ సందర్భంగా పదో వర్ధంతి కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా నాయకులు సీసం సురేష్, పల్లపు వెంకట్ మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో చింతూరు మండలంలో సిపిఎం పార్టీ నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించారని, ఆదివాసీల సమస్యలపై నిత్యం పనిచేస్తూ ప్రజా నాయకుడిగా, కొమ్ము డాన్స్ కళాకారుడిగా ఈ ప్రాంత రాష్ట్రస్థాయి అధికారులలో మంచి గుర్తింపు వచ్చినటువంటి నాయకుడు అని, అలాంటి నాయకుడుపై మావోయిస్టు పేరు పెట్టుకున్న నరహంతకులు హత్య చేసి ఏం సాధించారని ఈ సందర్భంగా అన్నారు. ఈ ప్రాంతంలో పార్టీ నిర్మాణాన్ని పటిష్టపరుస్తూ ప్రజా సమస్యలపై కార్యకర్తలు పట్టుదలగా పనిచేస్తూ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడమే పట్రా ముత్యం గారికి నిజమైన నివాళి అని ప్రజా నాయకులు చనిపోయిన ప్రజల గుండెల్లో ఉంటారని నర హంతకులు అడవుల్లో ఉంటారని అన్నారు. ఆదివాసీలో పేదలు సమస్యలపై నిరంతరం పోరాడటమే ముత్యంకు నిజమైన నివాళి అనిఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో పట్రా రమేష్, పాపారావు, ముట్టం రాజయ్య, సోడే లెనిన్, జయమ్మ, నాగేశ్వరరావు, కిష్టయ్య, పట్రా ముత్యం కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

5వ డివిజన్‌లో జనసేన 'యుద్ధానికి మేము సిద్ధమే'

కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ సిటిలో జనసేన పార్టీ పి.ఏ.సి సభ్యులు మరియు కాకినాడ్ సిటి ఇంచార్జ్ ముత్తా శశిధర్ నాయకత్వంలో 5వ డివిజన్ మాధవనగర్ కనకదుర్గమ్మ గుడి ప్రాంతంలో సిటీ జనరల్ సెక్రెటరీ పెద్దిరెడ్డి ఉదయ భాస్కర్ ఆధ్వర్యంలో ఆదివారం మన నివాసానికి ఇళ్ళు కావాలి మన కాకినాడలోనే అని అంటూ మేము సిద్ధం అనే కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు మాట్లాడుతూ ఇటీవల ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సిద్ధం అని చెపుతూ సభలు పెడుతున్నారనీ కాకినాడలోని ప్రజలకు ఇళ్ళు ఇస్తామంటూ సిటీకి దూరంగా వేరే గ్రామంలోకి తోలేస్తూ ఖాళీ చేయించేందుకు సిద్ధంగా ఉన్నారా అని ప్రశ్నించారు. ఈ ఊరి ప్రజలను ఈప్రాంతానికి దూరంచేస్తూ దూరంగా ఇళ్ళు ఇస్తున్నామని నగరబహిష్కరణలాగా చేస్తున్న ఈ వై.సి.పి. ప్రభుత్వ చర్యలని జనసేనపార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఈనాడు కాకినాడలోని అన్ని వర్గాలూ మీరు పెంచిన ఆస్తిపన్నులకు, చెత్తపన్నుకు, కరెంటు చార్జీల పెంపుకి మిమ్మల్ని గద్దెదించేందుకు సిద్ధం అని అంటూ నినాదాలు చేసారు, ఈ ప్రాంతంలోనే వీళ్ళకి ఇళ్ళు ఇవ్వాలని నినందించారు. కాకినాడలోనే ఇళ్ళు పొందే విధంగా వీరందరికీ జనసేనపార్టీ హామీ ఇస్తోందని తెలియచేసారు. జనసేనపార్టీ, తెలుగుదేశం, బి.జె.పి. కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసాకా కాకినాడలోని ప్రతి పేదవాడికీ కాకినాడలోనే ఇల్లు ఇస్తామని తెలియచేసారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అట్ల సత్యన్నారాయణ, జిల్లా సమ్యుక్త కార్యదర్శి బడే క్రిష్ణ, సిటీ ఉపాధ్యక్షుడు అడబాల సత్యన్నారాయణ, పెద్దిరెడ్డి ఉదయ భాస్కర్, టేకు రాము, కనిగిరి సుభాష్, పానుగంటి మణికంఠ, మైగాపులు వంశీ, చోడిశెట్టి సతీష్, నిమ్మకాయల రామారావు, ఎండీ షామీర్, పెద్దపటి వీరబాబు, సుజాత, మరియా, లీలా, కంఠ రవి, మధు, కోడి శ్రీను, దుర్గ ప్రసాద్, పాలిక శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన మాస దీక్ష సూర్యారాధన

అమలాపురం,మేజర్న్యూస్ : రూరల్ మండలం ఇందుపల్లి గ్రామంలో నెలరోజులుగా జరుగుతున్న నవమ వార్షిక మాస దీక్ష సూర్యారాధన పూర్ణాహుతి కార్యక్రమంలో వైభవంగా ముగిసింది.నెలరోజులు పాటు మాఘ మాసం సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి సూర్య ఆరాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. యాగ కర్త గొర్తి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రతిరోజు సాయంత్రం నాదనీరాజనం, శ్రీ చక్ర అర్చన, తీర్థ ప్రసాద వితరణ, సువాసిని పూజా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన పూర్ణాహుతి కార్యక్రమంలో వేలాదిగా భక్తులు తరలివచ్చి కార్యక్రమాన్ని తిలకించారు.అనంతరం పెద్ద ఎత్తున అన్న సమారాధన కార్యక్రమం జరిగింది.

శ్రీ వీరభద్ర యువజన సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన

పెరవలి, మేజర్ న్యూస్ : తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ముక్కామల గ్రామంలో శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వారి అలుగు సంబరం మహోత్సవం ముగింపు సందర్భంగా మార్చి 10వ తేదీ ఆదివారం ముక్కామల శ్రీ వీరభద్ర యువజన సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. సుమారు 3500 మంది భక్తులు పాల్గొన్న ఈ అన్న సమరాధన కార్యక్రమానికి కీర్తిశేషులు కరేళ్ల రామకృష్ణ కుమారులు రాజేంద్రప్రసాద్ ,సతీష్ లు ఆర్థిక సహాయం అందించినట్లు ఉత్సవ కమిటీ వారు తెలియజేశారు.

నిడదవోలులో త్రిముఖ పోటీ తప్పదా..?

-స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చెయ్యాలని శేషారావు ఇంటిని ముట్టడిస్తున్న అభిమానులు..

-2009 ఫలితాలే రిపీట్ అవుతాయా..

పెరవలి,మేజర్న్యూస్ : పెరవలి మండలానికి సంబంధించిన ప్రతి గ్రామంలోనూ మాజీ శాసనసభ్యులు బూరుగుపల్లి శేషారావు కు సొంత క్యాడర్ అనుచరులు బలంగా ఉండటం ప్రస్తుతం నిడదవోలు నియోజక వర్గ శాసనసభ అభ్యర్థిత్వంపై వస్తున్న ఊహాగానాలకు నిడదవోలు టిడిపి మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగాలని టిడిపి క్యాడర్ రోజురోజుకు నిరసనలు ఉధృతం చెయ్యడంతో అటు అధిష్టానానికి చెప్పలేక, ఇటు క్యాడర్ ను సమన్వయ పరచలేక శేషారావు సంకట స్థితిని ఎదుర్కోవాల్సి వస్తుంది. టిడిపి జనసేన పొత్తులోభాగంగా నిడదవోలు టికెట్ జనసేనకు కేటాయిస్తున్నారని తెలియడంతో టిడిపి వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎట్టిపరిస్తుతుల్లోనిడదవోలు టికెట్ టిడిపికే కేటాయించాలని, లేని పక్షంలో స్వతంత్ర అభ్యర్థిగా ఐనా పోటీకి దిగాలని టిడిపి అభిమానులు శేషరావుకు అల్టిమేటమ్జారిచేస్తున్నారు.వేలివెన్నులో ఆయన స్వగృహాన్ని ముట్టడించడం, నిడదవోలు వీధుల్లోకి వేలాదిగా తరలివచ్చి నిరసన ప్రదర్శనలు చేపట్టడం,రోజురోజుకి గ్రామాల నుండి తరలి వస్తున్న అభిమానుల ఒత్తిడికి తలోంచాల్సిన పరిస్థితి శేషరావుకు తప్పేలా లేదు.

–నిడదవోలు నియోజకవర్గ తెదేపా జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థిగాకందుల దుర్గేష్ : నిడదవోలు టిడిపి జనసేన ఉమ్మడి అభ్యర్థి ప్రకటన అధికారకంగా వెలువడకపోయినా, జనసేన అభ్యర్థిగా కందుల దుర్గేష్ పోటీ చేస్తున్నారనే సమాచారం ప్రచారంలో ఉంది. రాజమండ్రి రూరల్ అభ్యర్థిగా జనసేన నుండి దుర్గేష్ పోటీ చేయవలసి ఉండగా, టిడిపి సీనియర్ నేత గోరింట్ల బుచ్చయ్య చౌదరిఒత్తిడిమేరకు టిడిపి అధిష్టానం ఒక మెట్టు దిగివచ్చి టికెట్ కేటాయించాల్సి వచ్చింది. తప్పని పరిస్థితిలో జనసేన ఆశవాదిగా ఉన్న దుర్గేష్‌కు నిడదవోలు టికెట్ ఇస్తున్నారనే ప్రచారం జరుగుతుంది.

నిడదవోలు ఓటరు ఎటువైపు :నిడదవోలు నియోజకవర్గంలో జనవరి 2022 నాటికీ 2,06,351 మంది ఓటర్లు ఉన్నారు. సుమారుగా కాపు సామజిక వర్గం 45,273 మాల సామజిక వర్గం 30,416 , గౌడ, శెట్టిబలిజ 30,211, కమ్మ 25,587, మాదిగ సామజిక వర్గం 14,135, ముస్లింలు 6,892,బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియులు 13,288 ప్రధానంగా ఉన్నారు. నియోజకవర్గం లో మొత్తం బీసీ కులాల నుండి 70,000 మంది ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గం ఏర్పడిన తరువాత మూడు సార్లు జరిగిన ఎన్నికల్లో రెండు సార్లు టిడిపి, ఒకసారి వైసిపి అభ్యర్థులు గెలుపొందారు. 2009లో కాంగ్రెస్, టిడిపి, ప్రజారాజ్యం త్రిముఖ పోటీలో టిడిపి అభ్యర్థిబూరుగుపల్లి శేషారావు 34.14శాతంతో 51,680 ఓట్లు సాధించి గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థి గెడ్డం శ్రీనివాస్ నాయుడు 30.33శాతంతో 45,914 ఓట్లు సాధించి రెండవ స్థానంలో, ప్రజారాజ్యం నుండి రుద్రరాజు గజపతి 29.14 శాతంతో 44,511 ఓట్లు సాధించి మూడవ స్థానంలో నిలిచారు.2014 ఎన్నికల్లో టిడిపి నుండి బూరుగుపల్లి శేషారావు 49.93శాతంతో 81,591 ఓట్లు సాధించి విజయం సాధించారు. వైసిపి నుండి పోటీ చేసిన రాజీవ్ కృష్ణ 46.04 శాతంతో 75,232 ఓట్లుసాధించి రెండవ స్థానంలో నిలిచారు. 2019 ఎన్నికల్లో టిడిపి, వైసిపి, జనసేన త్రిముఖ పోరులో గెడ్డం శ్రీనివాస్ నాయుడు 48.19 శాతంతో 81,001 ఓట్లతో విజయం సాధించారు.టిడిపి అభ్యర్థి బూరుగుపల్లి శేషారావు 35.29శాతంతో 59,313 ఓట్లు సాధించి రెండవ స్థానంలో నిలిచారు. జనసేన నుండి అతికాల రమ్య 13.73 శాతంతో 23,073 ఓట్లు సాధించి మూడవ స్థానంలో నిలిచారు.

– వైసిపి విషయానికి వస్తే పూర్తిగా జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు పైనే ఆధారపడే పరిస్థితి...

స్వతంత్ర అభ్యర్థిగా శేషారావు పోటీ చేస్తే నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో ఉన్న గణనీయమైన ఓటు బ్యాంకు,సొంత క్యాడరే తనను నెగ్గిస్తుందనే ధీమా ఆయనకు ఉంది. ప్రస్తుత పరిస్థితిలో ఉమ్మడి అభ్యర్థి ఇన్ని అవాంతరాలను అదిగమించగలరా..లేదా అనేది మిలియన్ డాలర్ ప్రశ్న. నామినేషన్ల పరంపర ముగిస్తే తప్ప త్రిముఖ పోటీ తెరలు తొలగవు.

స్వచ్ఛభారత్ వ్యక్తిగత బాధ్యత

- -డాక్టర్ బిఈవిఎల్ నాయుడు

-సముద్ర తీర పరిశుభ్రతా కార్యక్రమంలో పాల్గొన్న ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు

కాకినాడ, మేజర్ న్యూస్ : స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం, బిసిడిఇ ఆధ్వర్యంలో కాకినాడ సముద్ర తీర పరిశుభ్రతా కార్యక్రమం నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు తెలిపారు.ఆదివారం సేవా కార్యక్రమాలలో భాగంగా ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం విద్యార్థులు స్వచ్ఛతే సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాకినాడ బీచ్ లో గల వ్యర్థాలను కొంతమేర తొలగించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ' స్వచ్ఛభారత్ నిర్మాణం వ్యక్తిగత బాధ్యత అని తెలిపారు. ప్లాస్టిక్ రహిత సమాజం వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రతి ఆదివారం సేవకు కొంత సమయాన్ని కేటాయించడం అభినందనీయమని అన్నారు. అనంతరం విద్యార్థులు సముద్ర తీర పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం 7 గంటల నుండి 9గంటల వరకు 80 మంది విద్యార్థులు బృందాలుగా విడిపోయి వాకలపూడి బీచ్ లో గల ప్లాస్టిక్ వ్యర్థాలు , పగిలిన గాజు పదార్థాలను సేకరించి, కొంతమేరకు పరిశుభ్ర పరిచారు.

ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్చార్జ్ మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.తేజేశ్వరరావు, ఎల్దివాకర రావు మరియు వాలంటీర్లు పాల్గొన్నారు.

యనమల, జ్యోతులను కలిసిన జడ్పీ మాజీ ప్రతిపక్ష నేత తోట నవీన్

కాకినాడ/తుని, మేజర్న్యూస్ : జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం కిర్లంపూడి గ్రామానికి చెందిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జిల్లా పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత తోట నవీన్ శాసనమండలి ప్రతిపక్ష నాయకులు, మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడిని, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూని తేటగుంటలోని రామకృష్ణుడు క్యాంప్ ఆఫీస్ వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరంనవీన్ మాట్లాడుతూ క్రియా శీలక రాజకీయాల్లో యాక్టివ్‌గాపాల్గొంటూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కాకినాడ పార్లమెంట్ పరిధిలోని 7నియోజకవర్గాల్లో టిడిపి, జనసేన,బిజెపిపార్టీలగెలుపు కోసం పనిచేస్తానని, ముఖ్యంగా జగ్గంపేట నియోజకవర్గంలో జ్యోతుల నెహ్రూని గెలిపించడానికి పనిచేసి టిడిపి, జనసేన,బిజెపిఉమ్మడి జెండా జగ్గంపేట నియోజక వర్గం లోఎగరవేస్తాననిఅన్నారు. ఈకార్యక్రమంలోటిడిపినేతలుపాల్గొన్నారు.

గిరిజన చట్టాలు పటిష్టంగా అమలు చేయాలంటూ రాజవొమ్మంగిలో బంద్

రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : జీవో నెంబర్ 3,1/70 చట్టం, గిరిజన హక్కులు,చట్టాలు పటిష్టంగా అమలు చేయాలంటూ ఆదివారం రాజవొమ్మంగి లో బంద్ నిర్వహించారు.గిరిజన సంఘం,ఆదివాసీ జేఏసి ఆధ్వర్యంలో తలపెట్టిన ఏజెన్సీ బంద్ విజయవంతమైంది.బంద్ నేపథ్యంలో వర్తక,వాణిజ్య,వ్యాపార సముదాయాలు స్వచ్ఛందంగా మూత పడ్డాయి.,వాహన రాకపోకలు గంటలు తరబడి నిలిచిపోయాయి. గిరిజనులు రాజవొమ్మంగి అల్లూరి జంక్షన్ వద్ద జాతీయ ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు.,గిరిజన హక్కులు చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని,జీవో నెంబర్ 3,ఏజెన్సీ లో ఉద్యోగాలు గిరిజనులతోనే నింపాలని బిగ్గరగా నినదించారు.,ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం,ఆదివాసి జేఏసీ నాయకులు కుంజం జగన్నాథం,కొండ్ల సూరిబాబు,పాండవుల సత్యనారాయణ,ప్రవీణ్, వజ్రపు అప్పారావు,గంపా నాగరాజు, తాము సూరిబాబు,ఈకా అచ్చిరాజు,ఈకా పెంటన్నదొర,రామకృష్ణ,బి రామకృష్ణ,సిపిఎం నాయకులు పొత్తూరి సత్యనారాయణ,జర్తా రాజు, గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ,సీఐటీయూ ప్రజా సంఘాల నాయకులు, జి నానాజి,జి రమేష్,ఎం రమేష్,రామరాజు,పెద్ద సంఖ్యలో గిరిజనులు వున్నారు.

గడప గడపకు సంక్షేమ పత్రాలు పంపిణీ

రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : గడప గడపకు సంక్షేమ పత్రాలు పంపిణీ వాలంటీర్లు ద్వారా జరుగుతుందని 57నెలల్లో ప్రతీ ఇంటికి ప్రభుత్వం అందజేసిన సంక్షేమం బ్రోచర్ లబ్ధిదారులకు ఇవ్వడం జరుగుతుందని ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అన్నారు. తొలుత కింద్ర గ్రామంలో వాలంటీర్ కె గంగ భవాని ప్రతీ ఇంటికి వెళ్ళి 5సం లలోప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలు బ్రోచర్ ఇచ్చి వివరించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమం మొత్తం 16 సచివాలయంలో జరుగుతుందని వాలంటీర్స్ తో పాటు గృహసారదులు సచివాలయం కన్వీనర్లు ద్వారా కూడా సమాచారాన్ని అందించి. అన్ని గ్రామాల్లో వాలంటీర్స్ తప్పక ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ కోరారు.

ఆట మొదలైంది..

వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలారా నేడే చూడండీ నేడే వినండీ మీ అభిమాన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆటమొదలైంది, చూసేవారికి చూసినంత, వినేవారికి విన్నంత, మధురాధి మధురమైన పాటలతో! మైమరిపించే ఆటలతో! ఏంటాని ఆశ్చర్యపోతున్నారా! ఔనండీ ఎన్నికలు అనే సినిమా వచ్చింది. ఐదేళ్లకు ఒక్కసారి వస్తుంది. ఆలోచించండి,ఒకటికి రెండుసార్లు ఆలోచనచేసి ఓటువేయండీ. మాటలకు మోసపోకండి.మీరు తీసుకునే నిర్ణయం మీభవిష్యత్తు కోసం,భావితరాలకుఅభ్యున్నతి కోసం,పోలవరం నిర్వాసితులకోసం,పోలవరం,ప్రాజెక్టు, ఆర్&ఆర్ కోసం,ముంపు మండలాల అభివృద్ధి కోసం, రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి!మీఓటు. మీభవిష్యత్తు ఆలోచించినిర్ణయం తీసుకోండి.మళ్లీఐదేళ్లవరకు ఎన్నికలు వచ్చే అవకాశం ఉండదు. ఖచ్చితత్వం,కమిట్మెంట్,తో ఆలోచించినిర్ణయం తీసుకుంటారని,మన ఆదాయం, మనఖర్చు,ప్రభుత్వం ఇచ్చేపథకాలు,పెరిగే రేట్లు,ఎవరిని ఎన్నిక చేయాలి,మన అవసరాలు "కాదు" మనఅభివృద్ధి కావాలి!నిరుద్యోగులకు "ఉపాధి" ఉద్యోగ" అవకాశాలు మెరుగుపర్చాలి.విద్యా,వైద్యం, త్రాగునీరు,సాగునీరు, ఎంప్లాయిమెంట్,ఇవి కథా కావాల్సినవి.రైతులు పండించే పంటలకు,దళారీ వ్యవస్థ లేకుండా గిట్టుబాటు ధరలు కావాలి! మండల కేంద్రాలలో భవనాలు కాదు కావాల్సింది,బిల్లింగ్ లతో పాటు నిపుణులైన వైద్య సిబ్బందిని ఏర్పాటు చేసి,అన్నీజబ్బులకు వైద్య సేవలు అందించాలని, మందులతో సహా వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తే!అదికదా!అభివృద్ధి. పేదకు అందే సహాయం,ఎంత?వాళ్ళు నష్టపోయేది ఎంత? చాలామంది వైద్య ఖర్చులు భరించలేకనే! నిరుపేదలుగా మిగిలిపోతున్నారు.ఎక్కువ మంది వైద్య ఖర్చుల భరించలేక ప్రాణాలు పోతున్నాయి.చేసినఅప్పులు తీర్చలేక వెట్టిచాకిరీచేస్తూ జీవితాలు మగ్గిపోతున్నాయి. ఆరోగ్యశ్రీ కాదు! ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన చికిత్స చేయాలి.ఆరోగ్యశ్రీ ని నమ్ముకుంటే జేబులకు చిల్లే!ఆదిశగా ప్రభుత్వం వైద్యులను ఏర్పాటు చేసి చేవాలందించాలని, మీఓటు ఆయుదంగా మారాలని సంక్షేమంతో పాటుఅభివృద్ధికావాలని,మాయమాటలకు లొంగకుండా ఉండాలని,ఓటు వేసేముందు సరైన నాయకున్నీ ఎన్నుకోవాలని,మీఓటు విలువ ఐదేళ్లు మర్చిపోకండి.బూతులు మాట్లాడేవారికి,భూతులోనే సమాధానం చెప్పండి.మిమ్మల్ని ఎన్నుకొన్నది.బూతులు మాట్లాడేందుకు కాదని,ప్రజల సమస్యలు తీర్చేందుకని,గుర్తు చేయండీ.మేము కట్టే పన్నులు మీ విలాసవంతమైన జీతాలకు కాదని నిరూపించే సమయం వచ్చింది.(మళ్లీ కలుద్దాం)

పిఠాపురంలో జనసేన పార్టీని గెలిపించుకుంటాం...

-పిఠాపురం నియోజవర్గ జనసేన నాయకులు చెల్లుబోయిన సతీష్ కుమార్

పిఠాపురం, మేజర్ న్యూస్ : పిఠాపురం నియోజవర్గంలో జనసేన పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని జనసేన నాయకులు చెల్లుబోయిన సతీష్ కుమార్ అన్నారు. పిఠాపురం స్థానిక ఉప్పాడ రైల్వే గేటు వద్ద రోడ్డు, కల్వర్టు స్థితిగతులపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఫ్లై ఓవర్ తో పాటు ప్రమాద కరంగా మారిన కల్వర్టును కూడా నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు చెల్లిపోయిన సతీష్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ... పవన్ కళ్యాణ్ ఆశయాలు సిద్ధాంతాలు మేరకు, నియోజవర్గ ఇన్చార్జ్ తంగేళ్ల ఉదయ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఈ నిరసన కార్యక్రమం చేపట్టామని, రైల్వే గేటు వద్ద ఉన్న ఏడు దశాబ్దాలనాటి ఏలేరు వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులకుగురవుతున్నారని తెలిపారు. ఆ రైల్వే గేట్ నుండి సుమారు 40 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని, ప్రయాణం చేయాలంటే వాహనదారులు భయబ్రాంతులకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం అభివృద్ధి చేసిందని గొప్పలు చెప్తుంది తప్ప ప్రజా సమస్యలు గాలికి వదిలేసిందని తెలుసుకోకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. ప్రభుత్వం ఇకనైనా మేలుకొని ప్రజలకు మేలు జరిగే విధంగా కల్వర్టు ఫ్లైఓవర్ పంపిన నిర్మాణాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మురాలశెట్టి సునీల్ కుమార్, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, రాయవరం శ్రీను, మహిళా నాయకురాలు పిల్లా రమ్య జ్యోతి మరియు ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వివక్షలేని వ్యవస్తే మా లక్ష్యం

-ఎస్.టి.ఎస్.సి.కమిషన్ సభ్యులు చిక్కాల బాలకృష్ణ...

వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ : వివక్ష లేని వ్యవస్థ ఏర్పాటుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని, వచ్చేది వై.సి.పి.ప్రభుత్వమేనని, మళ్లీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి, ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం తధ్యమని ఆయన అన్నారు. ఆదివారం ఇష్టాగోష్ఠిగా కొద్దిసేపు మీడియాతో మాట్లాడారు. ఇచ్చిన హామీలకు కట్టుబడి తారతమ్యం లేకుండా ఇచ్చామని, ఈసారి ఎన్నికల్లో విజయసాధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అన్నీరంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు,ముఖ్యమంత్రి వైఎస్ సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు.సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి,వేలాది మందికి ఉద్యోగాలు కల్పించి,స్వర్ణయుగం లాంటి అద్భుతమైన పాలన సాగుతోందని ఆయన స్పష్టంచేశారు.అభివృద్ధిని,సంక్షేమాన్ని,సమపాళ్లలో ముందుకు తీసుకువెళ్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి,హాట్రిక్ కొట్టి రెండవసారి,అద్భుతమైన పాలన కోసం,ఉత్సహంగా ఉన్నారని ఆయన తెలిపారు.బడుగు బలహీనవర్గాలకు,చట్టసభల్లో ఎక్కువ అవకాశాలు కల్పించిన ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఉందని ఆయన చెప్పారు.మహిళలకురిజర్వేషన్లు 50% ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి,ప్రభుత్వానిదేనని ఆయన తెలిపారు.కులం,మతం,పార్టీ,గతం,చూడకుండా అందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే సాధ్యమైందని ఆయన స్పష్టంచేశారు. సిద్ధం సభలకు వచ్చే జనాలను చూసి ప్రతిపక్షాలకు మైండ్ బ్లాక్ అయ్యిందని ఆయన అన్నారు. రంపచోడవరం నియోజకవర్గంలోభారీ విజయంతో చరిత్ర సృష్టించ బోతున్నామని,ఇంకా భారీ మెజారిటీపై కన్నేశామని, పక్కా ప్రణాళికతోముందుకు వెళ్తామని రికార్డ్ స్థాయి మెజారిటీతో రంపచోడవరం నియోజకవర్గ వై.సి.పి.అభ్యర్థి ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి గెలవబోతోందని జోస్యం చెప్పారు.

రాపర్తి గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ...

-ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచిన మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ

పిఠాపురం,మేజర్న్యూస్ : పిఠాపురం మండలం రాపర్తి గ్రామంలో బాబు ష్యూరిటి–భవిష్యత్తుకు గ్యారంటీ, మన ఇంటికి మన వర్మ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్ళి సూపర్ 6 పథకాలు ప్రచారం మరియు గత హయాంలోతానుఅభివృద్ధిచేసిన కరపత్రాలు పంపిణీ చేసి ఆశీర్వదించమని కోరారు. ఈ సందర్భంగా పత్రిక ప్రకటన విడుదల చేశారు.

రైతులు పొలాలు ఎండిపోయి దారుణమైన పరిస్థితుల్లో ఉన్నా.. నీరు ఇవ్వలేని దౌర్భాగ్య పరిస్థితుల్లో ఉన్నారని, దీనికి కారణం ఇక్కడి నాయకులుమరియుముఖ్యమంత్రి జగన్ అని విమర్శించారు. ఈ పంటకు నీరు లేదనుకుంటే సుమారుగా 15000 ఎకరాలు పంట నష్టం జరుగుతుందని,సుమారు రూ.100కోట్ల రూపాయలు నష్టం రైతులకు జరుగుతుందన్నారు.ప్రస్తుత ప్రభుత్వం పురుషోత్తపట్నం బిల్లు కట్టలేక పక్కకు పెట్టడం, ఈ నీరుని తీసుకెళ్లి పెద్దాపురంపంపించడం,ఏలూరులో నీరుని మిగిలిన నియోజకవర్గం పైనుంచి వెళ్ళిపోతున్నా..మాట్లాడకుండా వున్నారని అన్నారని అన్నారు. రాపర్తి గ్రామంలోకాపుకళ్యాణమండపం ప్రారంభించామని, నియోజకవర్గ అంతా కూడా 28 కాపు కళ్యాణ మండపాలు సగం పూర్తయి ఉన్నాయన్నారు. ఈ కళ్యాణ మండపంలో ఎందుకు ఆపివేశారో ఇప్పుడు ఓటు అడిగే వైఎస్ఆర్సిపి నాయకురాలు తెలియజేయవలసిన పరిస్థితి ఉందని పేర్కొన్నారు. గ్రామంలో మొత్తం సిమెంట్ రోడ్లన్నీ కూడా తెలుగుదేశం పార్టీ వేయడం జరిగిందని, రాబోయే రోజుల్లో మొత్తం గ్రామ అంత డ్రైన్లు అన్ని కూడా పూర్తి చేస్తామని చెప్పి హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు.

అంగన్‌వాడీ వర్కర్స్ & హెల్పర్స్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : శ్రామిక మహిళలకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, పని ప్రదేశాలలో లైంగిక వేధింపుల నిరోధక కమిటిని ఏర్పాటు చేయాలని, ఇంటి పనిని కూడా కనీస వేతనాలలో లెక్కించి చెల్లించాలని, మహిళలపై అత్యాచారాలను నిరోధించాలని డిమాండ్ చేస్తూ పెద్దాపురం మండలం దివిలి గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ & యూనియన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు దాడి బేబి, ఐద్వా జిల్లా కార్యదర్శి వరలక్ష్మీ, ప్రాజెక్ట్ కార్యదర్శి ఎస్తేర్ రాణి, తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ నాయకులు నాగరత్నం,భవాని,అంగన్‌వాడీయూనియన్ నాయకులు కె.నూకరత్నం, మణికంఠ,లలిత,సూర్యకుమారి, చక్రవేణి, కృష్ణవేణి, నాగకుమారి, సుబ్రహ్మణ్యేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

గ్రంధాలయంలో సండే స్టోరి టైమ్

పెద్దాపురం,మేజర్న్యూస్: పెద్దాపురం ప్రధమ శ్రేణి శాఖా గ్రంధాలయంలో ఆదివారం గ్రంధాలయాధికారి పాలంకి నాగరాజు ఆధ్వర్యంలో సండే స్టోరి టైమ్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్ధులకు కథలు చెప్పడం, పుస్తకాలు చదివించడంతో పాటు ఉపాధ్యాయులు విద్యార్ధులకు కథలుతో పాటు వాటి యొక్క విశిష్టత గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిబ్బంది సింగం బుల్లియ్య, గ్రంధాలయ పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

స్థానికుడినైన తనను ప్రజలు ఆశీర్వదించాలి

- వైసీపీ ఇంచార్జ్ దవులూరి దొరబాబు

సామర్లకోట,మేజర్న్యూస్ : ఎన్నికల ప్రచారంలో భాగంగా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్ధిగా పోటీచేస్తున్న స్థానికుడునైన తనను ప్రజలు ఆశీర్వదించాలని నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ దవులూరి దొరబాబు పేర్కొన్నారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా ముందుగా సామర్లకోట జగనన్న కాలనీ వద్ద గల రాజశేఖర రెడ్డి విగ్రహానికి దొరబాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.. అనంతరం ఆయన ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ 40 సంవత్సరాల తరువాత స్థానికుడునైన తనకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అవకాశం కల్పించారని రానున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని ప్రతీ ఇంటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో వైసీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే బీసీలకు రాజ్యాధికారం

-బీసీల సంఘాల నేత రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య

పెరవలి,మేజర్న్యూస్ : తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కానూరు గ్రామంలో మార్చి 9వ తేదీ శనివారం రాత్రి ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యంలో నిడదవోలు నియోజకవర్గ బీసీ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సభకు భారీగా తరలివచ్చిన బీసీలు, మైనార్టీలు ముఖ్యఅతిథిగా విచ్చేసిన బీసీ సంఘాల నేత ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమైందని అన్నారు. పెరవలి మండలం కానూరు గ్రామంలో ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అధ్వర్యంలో నిడదవోలు నియోజకవర్గ బీసీ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో బీసీలకు పెద్ద ఎత్తున పదవులు ఇచ్చి బలమైన వర్గాలుగా తీర్చిదిద్దారని కొనియాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కేబినెట్‌లో 25 మందికి గానూ 11 మంది బీసీలకు అవకాశంకల్పించిన గొప్ప వ్యక్తి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 84 మంది మున్సిపల్ ఛైర్మన్లు ఉంటే అందులో 44 మంది బీసీలేనన్నారు. 14 మేయర్ పోస్టుల్లో 9 మంది, 13 జడ్పీ ఛైర్మన్లలో ఆరుగురు, 44 మంది శాసనమండలి సభ్యుల్లో 30 మంది, 637 మంది ఎంపీపీలలో 237 మంది బీసీలు అవకాశం కల్పించారన్నారు. అంతేగాక 135 కార్పోరేషన్లలో 55 కార్పోరేషన్లకు బీసీ సామాజిక వర్గానికి చెందిన వారే ఛైర్మన్లుగా ఉన్నారన్నారు. ఎమ్మెల్యే జి శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ బడుగులు అగ్రవర్ణాలతో సమానం గా ఎదగాలన్న మహత్మా జ్యోతిరావుపూలే, డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ కలలను సీఎం జగన్ సాకారం చేశారన్నారు. నవరత్నాల్లో భాగంగా రూ.2.55 లక్షల కోట్లు విడుదల చేస్తే, అందులో రూ.1.26 లక్షల కోట్లు బీసీలకే అందాయన్నారు. నిడదవోలు మార్కెట్ కమిటీ ఏర్పాటుచేసి తొలి ఛైర్మన్ పోస్టు బీసీల వర్గానికి చెందిన వెలగన పోలయ్యకు కేటాయించామని చెప్పారు. రాజమండ్రి ఎంపీ సీటు 2019,2024 ఎన్నికల్లో బీసీలకే కేటాయించారన్నారు. మళ్లీ వంచించేందుకు బాబు కుయుక్తులు..రాజమండ్రి ఎంపీ మార్గాన్ని భరత్ రామ్ మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు బీసీ సామాజిక వర్గాల సంక్షేమాన్ని ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకే వాడుకున్నారని దుయ్యబట్టారు. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో నాటకాలకు తెరలేపారన్నారు. 26 వేల మంది బీసీలపై అక్రమ కేసులు బనాయించారంటూ అవాస్తవాలు ప్రచారం చేశారన్నారు. బీసీ డిక్లరేషన్ అంటూ మళ్లీ వంచించేందుకు కుట్రలు పన్ను తున్నారన్నారు. దివంగత నేత వైఎస్సార్ హయాంలోనే గీత, చేనేత కార్మికులకు 50 ఏళ్లకే పింఛన్ అందించే కార్యక్రమానికి బీజం పడిందని, నేడు తానేదో కొత్తగా ఇస్తామన్నట్లు ప్రకటించడం చంద్రబాబుకే చెల్లిందన్నారు. అలాంటి వ్యక్తికి జనసేన అధినేత పవన్ కల్యాణ్ వంత పాడుతుండడంహేయమన్నారు.టీడీపీ పాలనలో బీసీల కోసం ఎంత ఖర్చు చేశారు, తమ ప్రభుత్వంలో ఎంత మేలు చేశాం అనే అంశంపై దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. చంద్రబాబు మోసాలను పసి గట్టిన బీసీలు 2019 ఎన్నికల్లో బుద్ధి చెప్పారని, మళ్లీ ప్రజాకోర్టులో ఆయనకు గుణ పాఠం తప్పదని స్పష్టం చేశారు. 2014 ఎన్నికలకు ముందు బీసీ డిక్లరేషన్ పేరుతో 110 హామీలను ఇచ్చిన చంద్ర బాబు ఒక్కటి కూడానెరవేర్చలేదన్నారు. బీసీలు జడ్జిలుగా పనికిరారంటూ సుప్రీంకోర్టు కొలీజి యానికే లేఖ రాసిన ఘనుడు చంద్రబాబు అని దుయ్యబట్టారు. టీడీపీ ప్రకటించిన 94 సీట్లలో కేవలం 18 మాత్రమే బీసీలకు కేటాయించారం టేనే ఆయనకు వారిపై ఎంత గౌరవం ఉందో అర్థమవుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్ బీసీ లకు రాజ్యాధికారం కల్పించారని. ఎన్నికల్లో బీసీలంతా వైఎస్సార్సీపీవైపే ఉంటారని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలోముఖ్య అతిథులుగారాజమండ్రి పార్లమెంట్ సభ్యులు మార్గాన భరత్ రాజమండ్రి పార్లమెంట్ వైసిపి కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, పెరవలి మండలానికి చెందిన బీసీ నాయకులు పెరవలి మండలం వైయస్సార్సీపి అధ్యక్షులు వీరమల్ల సత్యనారాయణ జక్కం శెట్టి సత్య రాజేంద్రప్రసాద్ పసలపూడి భద్రయ్య ఆగర్తీస్వరూపారాణి ఉసులుమర్రు ఎంపిటిసి జెన్నీ వరలక్ష్మి దేవి అజ్జరం సర్పంచ్ సుధా భూషణం నిడదవోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెలగన పోలయ్య బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు, రాష్ట్ర బీసీ నాయకులు, జిల్లా బీసీ నాయకులు, నియోజకవర్గం, పట్టణ, మండలం, నాయకులు, మహిళా నాయకురాలు గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్, మేజర్ న్యూస్ : మహా శివరాత్రి పర్వదినాన్ని ఎంతో ఘనంగా భక్తి శ్రద్ధలతో శాటిలైట్ సిటి బి బ్లాక్ నందు వెంచేసివున్న శ్రీ ఉమాపార్వతి సమేత రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం నందు కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని జిల్లా ఇన్చార్జి మంత్రి రాష్ట్ర బీసీ సంక్షేమం సమాచార పౌర సంబంధాలు సినిమా ఆటోగ్రాఫీ శాఖ మంత్రి రాజమండ్రి రూరల్ నియోజకవర్గం కోఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు.

ఆదివారం రాజమండ్రి రూరల్ మండలం శాటిలైట్ సిటి బి బ్లాక్ లో గల శివాలయం లో ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమంలో మంత్రి వేణుగోపాల కృష్ణ స్థానిక నాయకులతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భగా మంత్రి వేణు గోపాలకృష్ణ మాట్లాడుతూ శివరాత్రి పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త శక్తిని తీసుకువచ్చి. వారు అనుకున్న లక్ష్యాలు నెరవేరాలని కోరుకుంటున్నానన్నారు. అదేవిధంగా రాష్ట్ర అభివృద్ధికి సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు చేయుటలో ఎల్లవేళలా మహా శివుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగమోహన్ రెడ్డి గారికి విజయాన్ని చేకూర్చాలని కోరుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మంత్రి వేణు గోపాలకృష్ణ అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొని పలువురు భక్తులకు స్వామి వారి ప్రసాదాన్ని స్వయంగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట సక్కా రాజబాబు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సోమవారం యధాతధంగా కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి స్పందన

-కలెక్టర్ డా.కే.మాధవీలత

రాజమహేంద్రవరం,మేజర్న్యూస్ : ప్రతి సోమవారం నిర్వహించే జిల్లా, డివిజన్, మండల స్థాయి స్పందన కార్యక్రమం మార్చి 11వ తేదీ సోమవారం యధావిధిగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. కె. మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి అందరూ జిల్లా స్థాయి అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని అన్నారు. అదేవిధంగా డివిజన్ స్థాయి లో ఆర్డీవో, మునిసిపల్ స్థాయిలో కమిషనర్లు, మండల స్థాయి అధికారులు, గ్రామ స్థాయి, గ్రామ, వార్డు సచివాలయాల నుంచి ప్రజలు నుంచి సంబంధిత సిబ్బంది ప్రజల నుంచి స్పందన అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. జిల్లా కలెక్టర్, ఇతర జిల్లా అధికారులు ఉదయం 10.00 నుంచి మ.1.00వరకు ఫిర్యాదులను కలెక్టరేట్‌లో స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు.రెవెన్యూ,మునిసిపల్,మండల,గ్రామ,వార్డు సచివాలయాలలో స్పందన ఫిర్యాదులు అందచేయాలని కలెక్టర్ తెలియచేశారు.మండల స్థాయి అధికారులు అందరూ మండల ప్రధాన కేంద్రంలో ఒకేచోట హాజరై ప్రజల నుంచి స్పందన అర్జీలు స్వీకరించాలన్నారు.

నేడు ఆర్డీఓ కార్యాలయంలో ప్రజా స్పందన

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా స్పందన కార్యక్రమం నిర్వహించబడునని, ఆర్డీఓ కార్యాలయం ఒక ప్రకటనలో భాగంగా తెలిపింది. దీనిలో భాగంగా సోమవారం ఉదయం 10 గంటల నుండి ప్రజా స్పందన కార్యక్రమం డివిజన్‌లోని 11 మండలాల పరిధిలో గల అర్జీదారులు ప్రజా స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని, తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆర్డీఓ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

యనమల, జ్యోతులను కలిసిన జడ్పీ మాజీ ప్రతిపక్ష నేత తోట నవీన్

కాకినాడ/తుని, మేజర్న్యూస్ : జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం కిర్లంపూడి గ్రామానికి చెందిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జిల్లా పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత తోట నవీన్ శాసనమండలి ప్రతిపక్ష నాయకులు, మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడిని, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూని తేటగుంటలోని రామకృష్ణుడు క్యాంప్ ఆఫీస్ వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం నవీన్ మాట్లాడుతూ క్రియాశీలకరాజకీయాల్లో యాక్టివ్‌గా పాల్గొంటూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లోకాకినాడపార్లమెంట్‌పరిధిలోని7 నియోజక వర్గాల్లో టిడిపి, జనసేన, బిజెపి పార్టీల గెలుపు కోసం పనిచేస్తానని ముఖ్యంగా జగ్గంపేట నియోజకవర్గంలో జ్యోతుల నెహ్రూని గెలిపించడానికి నా శక్తివంచన మేరా పనిచేసి టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి జెండా జగ్గంపేట నియోజకవర్గంలో ఎగరవేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు పాల్గొన్నారు.

8481 మంది లబ్ధిదారులకు రు. 15.64 రూపాయలు జమ చేసాం

-ఇప్పటి వరకు గత నాలుగు విడతలుగా లబ్ధిదారులైన అక్క చెల్లెమ్మలకు రు.60కోట్ల రూపాయలు జమ చేయడం జరిగింది.

-ప్రజలకు ఇచ్చిన మాటను నూటికి నూరు శాతం అమలు చేసిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్.జగమ్మోహనరెడ్డి -మంత్రి వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్, మేజర్ న్యూస్ : కష్టం తప్ప కల్మషం తెలియని 45 సంవత్సరాలు వయస్సు పై బడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు చెందిన అక్క చెల్లెమ్మలకు సీఎం.వైఎస్.జగమ్మోహనరెడ్డి ఆర్థిక భరోసాను అందించి అండగా నిలిచారని జిల్లా ఇన్చార్జి మంత్రి రాష్ట్ర బీసీ సంక్షేమం సమాచార పౌర సంబంధాలు సినిమా ఆటోగ్రాఫీ శాఖ మంత్రి రాజమండ్రి రూరల్ నియోజకవర్గం కోఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం రాజమండ్రి రూరల్ మండలం హుకుంపేట డి మార్ట్ ప్రక్కన గల ఆవరణలో ఏర్పాటుచేసిన వైయస్సార్ చేయూత నాలుగో విడత కార్యక్రమానికి స్థానిక నాయకులు అధికారులతో కలిసిమంత్రి వేణుగోపాలకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన మాటను నూటికి నూరు శాతం అమలు చేసిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్.జగమ్మోహనరెడ్డి అన్నారు. రాజమండ్రి రూరల్ మండలంలో 4వ విడతగా వైఎస్ఆర్ చేయూత పథకం కింద 8481 మంది లబ్ధిదారులైన అక్క చెల్లెమ్మలకు రు. 15.64 కోట్ల రూపాయలను జమ చేయగా.. గత నాలుగు విడతల్లో రు. లబ్ధిదారులైన అక్క చెల్లెమ్మలకు రు. 60 కోట్ల రూపాయలు అందించడం జరిగిందని స్పష్టం చేశారు. పేద మహిళలను ఆర్థికంగా ఆదుకుంటే చిన్న చిన్న చిరు వ్యాపారాలను ప్రారంభి, అప్పు తెచ్చుకునే స్థితి నుంచి అప్పు ఇచ్చే స్థాయికి ఎదుగుతారని ఆలోచించి సీఎం జగన్ మోహన్ రెడ్డి చేయూత కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి మహిళలకు ఆర్థిక భరోసాను కల్పించారన్నారు. తద్వారా కుటుంబానికి వారి పిల్లలు ఎదుగుదలకు ఆ మహిళ అండగా నిలుస్తారన్నారు. గత పాలకుడు డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తానని చేయకుండా మోసగిస్తే, ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ రుణమాఫీ ద్వారా ఆసరా కల్పించి నిజమైన పాలనను చేసి చూపించిన నేత సీఎం జగన్ మోహన్ రెడ్డి అని అందుకు ప్రత్యక్ష సాక్షులు మీరేనని మంత్రి అన్నారు. మహిళలు వారి కుటుంబాలకు ఆర్థిక వెన్నుదన్నుగా నిలబడేందుకు అమ్మ ఒడి, ఆసరా, చేయూత, చేదోడు వంటి అనేక పథకాలను అర్హులైన మహిళ లబ్ధిదారులకు అందించడం జరిగిందన్నారు. అమ్మ ఒడి అనే ఔషధం ద్వారా బాల కార్మిక వ్యవస్థను రూపుమాపడం ఇది దేశానికే ఆదర్శం అన్నారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్ పర్సన్ మేడపాటి షర్మిల మాట్లాడుతూ ఎటువంటి దళారీ వ్యవస్థ లేకుండా సీఎం వై ఎస్ జగన్మోహన్ రెడ్డి అర్హులైన లభిదారుల ఖాతాలకు ప్రభుత్వ పథకాలు ప్రయోజనాన్ని నేరుగా అందిస్తున్నారన్నారు. నాడు పాదయాత్ర లో ఇచ్చిన హామీ మేరకు సంవత్సరానికి రు.18750/-లు 4 విడతల్లో 75వేల రూపాయలు అక్క చెల్లమ్మ ఖాతాలకు అందించి ఆర్థిక భరోసా కల్పించారన్నారు. అమ్మఒడి, వైఎస్ఆర్. ఆసరా, వైఎస్ఆర్ చేయూత మూ అందించి మహిళలకు ఆర్థిక భరోసాను కల్పించారన్నారు.కార్యక్రమంలో రాష్ట్రహౌసింగ్ కార్పోరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి,ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ రేలంగి వీరవెంకటసత్యనారాయణ, మాజీ వైస్ఎంపీపీ నక్కా రాజబాబు, స్థానిక నాయకులు పసలపూడి శ్రీనివాసరావు, మేడిత్రిమూర్తులు,బండి నాగేశ్వరరావు, సుందరపల్లిఅనిల్,పిన్నమరెడ్డి సూర్యచంద్రరావు,పరిమి దుర్గారావు, ఇబ్రహీంబాషా,మీరావలీ, కామిరెడ్డి పెదకాపు, నేమానిసుశీల, కుడిపూడి పద్మ, గాదె అనురాధ,పేటరామకృష్ణ,పంచాయతీకార్యదర్శిలు,సచివాలయఉద్యోగులు,వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతు ఇంటి ముంగిటనే అన్ని సేవలు అందిస్తున్నాం

-హోంమంత్రి తానేటి వనిత

గోపాలపురం, మేజర్ న్యూస్ : గతంలో ఎన్నడూ లేని విధంగా రైతుకు అవసరమైన అన్ని సేవలు గ్రామంలోని జగనన్న ప్రభుత్వం అందిస్తుందని రాష్ట్ర హోం మరియు విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత తెలిపారు. రైతులందరూ సంతోషంగా ఉండాలి, వ్యవసాయం అంటే పండగలా చేసుకోవాలని అనేక రైతు సంక్షేమ కార్యక్రమాలను జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టారన్నారు. గోపాలపురం మండలం వేళ్ళచింతల గూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆదివారం హోం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ... రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వంగా పనిచేస్తుందన్నారు. విత్తనం దగ్గర నుంచి పంట విక్రయం వరకూ అన్ని వేళలా రైతులకు జగనన్న ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో విస్తారంగా పండిన ధాన్యాన్ని మంచి గిట్టుబాటు ధరతో ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. నవరత్నాలలో భాగంగా రైతు భరోసా సాయం కింద దేశంలో ఎక్కడా లేనివిధంగా కౌలు రైతులకు సైతం సంవత్సరానికి రూ.13,500 చొప్పున అందిస్తున్నామన్నారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మిన ప్రభుత్వంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అండగా ఉంటుందని హోంమంత్రి తానేటి వనిత తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ముక్కామల ఓధూరి వారిపాలెం గ్రామాల్లో బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే శేషారావు

పెరవలి, మేజర్ న్యూస్ : ముక్కామల గ్రామస్తులు మద్దిపాటి సూర్యారావు వయస్సు 94 సంవత్సరాలు ఇటీవల పాదానికి శస్త్ర చికిత్స చేయించుకున్నందున ఫిబ్రవరి 10వ తేదీ ఆదివారం నిడదవోలు మాజీ శాసనసభ్యులు తెదేపా ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావు ముక్కామల లోని మద్దిపాటి సూర్యారావును ఆయన కుమారుడు నరసింహారావును వారి స్వగృహం వద్ద పరామర్శించారు. అదేవిధంగా ఓదూరి వారి పాలెం గ్రామంలో ఇటీవల హార్ట్ సర్జరీ చేయించుకున్న రేలంగి నారాయుడు ను పరామర్శించారు. తదుపరి ముక్కామల గ్రామంలో ఇటీవల చనిపోయిన బొంతు మురళి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు చనిపోయిన బొంతు మురళి కి నలుగురు ఆడపిల్లలు ఉన్న సంగతిని తెలుసుకున్న బూరుగుపల్లి శేషారావు వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముక్కామల తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్ వేంద్ర వెంకట రామమూర్తి ఉప సర్పంచ్ కాల్దాసి వీరేష్ బాబు నిడదవోలు చంటి బోళ్ల మంగారావు మద్దిపాటి సత్యనారాయణ చిన్నంశెట్టి శ్రీను ఉమ్మడి రాముడు నల్ల సురేంద్ర వేంద్ర సన్నీ జక్కంశెట్టి మహి ఇతర తెదేపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మన్యం బంద్ విజయవంతం

వి.ఆర్.పురం,మేజర్న్యూస్ : మన్యం ఏజెన్సీలో ఆదివాసీలకు ఉద్యోగాలు 100% ఆదివాసి గిరిజనులకే కేటాయించి, జీవో3కి చట్టబద్ధత కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారంరాష్ట్ర మన్యం బంద్ వరరామచంద్రాపురంలో విజయవంతమైంది.ఉదయం 5 గంటల నుండే ఆదివాసీ గిరిజన సంఘాలనాయకులురోడ్డుపై బైఠాయించి,నిరసన తెలియజేశారు. తక్షణం ఆర్డినెన్సును జారీ చేయాలని100% ఉద్యోగాలు ఆదివాసీ గిరిజనులే ఇవ్వాలని ఆదివాసి గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు.ఈ బంద్ కు తెలుగుదేశంపార్టీ, సి.పి.ఎం,పార్టీ, రైతు సంఘం, ఏ.ఎస్.పి.సంఘాలు నాయకులు మద్దతు తెలిపారు. బంద్ తో అన్ని దుకాణాలు మూత పడ్డాయి.రవాణా వ్యవస్థ తీవ్ర అంతరాయం కలిగింది.ఈ కార్యక్రమంలో గిరిజనసంఘం మండల కార్యదర్శి పూనెం ప్రదీప్ కుమార్, సి.పి.ఎం,పార్టీమండల కార్యదర్శి సోయం చిన్న బాబు, ఆదివాసీ నాయకులు పాయం రామారావు, పాయం లక్ష్మణ్, సి.పి.ఎం,నాయకులు పంకు సత్తిబాబు, కుంజ నాగిరెడ్డి, తుర్రం బాబురావు, సర్పంచ్ వెట్టి లక్ష్మి, వడ్డది రమేష్, హాజరత్,లక్ష్మణ్, ప్రకాష్,విశ్వనాథ్,సూరిబాబు, పాల్గొన్నారు.

పిఠాపురం యోగా టీచర్‌కు మోస్ట్ ఇన్స్పైరింగ్ అవార్డు

పిఠాపురం,మేజర్న్యూస్ : పిఠాపురం యోగా టీచర్ వనం సత్య ప్రియకు మోస్ట్ ఇన్స్పైరింగ్ టీచర్‌అవార్డు లభించినట్టు ప్రకటన తెలియజేశారు. తమిళనాడు రాష్ట్రం చెన్నైలో నోవా మాగజైన్ వరల్డ్ రికార్డ్స్ చెన్నై వారు ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే సందర్భంగా మోస్ట్ ఇన్స్పైరింగ్ టీచర్ ఆఫ్ దిఇయర్ అవార్డును ఆంధ్రప్రదేశ్, కాకినాడ జిల్లా పిఠాపురంనకు చెందిన ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ మరియు యోగా టీచర్ శ్రీమతి వనం సత్య ప్రియ వీరబాబుకు అందచేశారు. ఈమె గతంలో ఇంటర్నేషనల్ 'యోగ సేవక్" ప్రైమ్ అవార్డు నేషనల్ స్పోర్ట్స్ అచీవమెంట్ అవార్డు అందుకున్నారు. పిఠాపురం నియోజకవర్గం పిల్లలకు యోగాలో శిక్షణ ఇచ్చి, వరల్డ్ యోగ కప్ విజేతలుగా తయారు చేస్తున్నారు.యోగా ఇంటర్నేషనల్, నేషనల్ జడ్జి గాను, ఇంటర్నేషనల్ కోచ్ గాను తను సేవలను అందిస్తున్నారు. శ్రీ పీఠకాపుర యోగ విద్యా పీఠం చైర్మన్ వనం వీరబాబు, సెక్రటరీ కొత్తెం రమేష్, మాగాపు గొల్లబాబు, ముమ్మిడి శ్రీనివాస్, గండేపల్లి రాంప్రసాద్,కొత్తెందత్తుడు, రావులమాధవ రావు, ముమ్మిడి శ్రీనివాస్, బొజ్జా దొరబాబు, ఆగంటి ప్రభాకర్, బాలిపల్లి రాంబాబు,మార్నిడి రంగబాబు, మన ఊరు మన బాధ్యత సేవా సంస్థ అధ్యక్షులు కొండేపూ శంకర్రావు, కార్యదర్శి అల్లవరం నగేష్ మరియు పలువురు ప్రముఖులు ఆమెను అభినందించారు.